



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 274 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 7 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :274 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 7 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను
# వదిలించుకుంటాం
## క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ

- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- తప్పులు చేసేవారిని వదిలించుకుంటానని హెచ్చరిక
- డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన



**పెన్ పవర్ డెస్క్:**తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణిక మని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం, సంక్షేమం–అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు. గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి

- మిగతా 2లో



## స్పేర్‌సిటీ.. భవిష్యత్ టెక్నాలజీకి వారధి

- మాస్కోలో వ్యాధి నిర్ధారణ చేసే ఏటీఎం... నారా లోకేష్ ఆశ్చర్యం
- మాస్కోలోని స్బేర్ సిటీని సందర్శించిన మంత్రి నారా లోకేష్
- వ్యాధి నిర్ధారణ చేసే స్బేర్ బ్యాంక్ ఏటీఎంను పరిశీలన
- ఏఐ, క్వాంటం టెక్నాలజీపై ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రతినిధులు
- డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్‌పై ఆరా

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రష్యా రాజధాని మాస్కోలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన అక్కడి ప్రతిష్టాత్మక స్బేర్ సిటీని సందర్శించి, ఆధునిక సాంకేతికతను పరిశీలించారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక

- మిగతా 2లో



## అసలు నువ్వెవరు?
### ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

- షూటింగ్‌లకు ప్రకాశ్ రాజ్ ఎప్పుడైనా సమయానికి వచ్చారా అని నిలదీత
- దేశానికి, తెలంగాణకు ఆయన చేసిన సేవ ఏంటని ఎద్దేవా
- గద్దర్ విషయంలో పవన్ కల్యాణ్‌ను విమర్శించే హక్కు లేదని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:**నటుడు ప్రకాశ్ రాజ్‌పై తెలంగాణ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు ప్రకా శ్ రాజ్‌కు

- మిగతా 2లో

## కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్

- కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు, రైతుల మోసపోయారన్న కన్నబాబు
- హామీలు నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా అని సవాల్
- గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని మండిపాటు



- మిగతా 2లో



## గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

- రూ. 4.77 కోట్ల అభివృద్ధి పనులకు వెనిగండ్ల రాము శంకుస్థాపన
- ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడమే తమ ధ్యేయమని వ్యాఖ్య
- గతంలో నిర్లక్ష్యానికి గురైన పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని వెల్లడి

- మిగతా 2లో








# రుతుపవనాలు వచ్చేశాయి..

- ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు
- రాయలసీమ ప్రాంతాన్ని తొలుత తాకినట్లు ప్రకటించిన విపత్తుల నిర్వహణ సంస్థ
- ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం
- తరచూ విరామాలు తీసుకుంటూ రుతుపవనాల గమనం సాగే సూచనలు
- కొన్ని జిల్లాల్లో వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలకు అవకాశం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. శనివారం రాయలసీమ ప్రాంతాన్ని రుతుపవనాలు తాకినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అధికారికంగా ప్రకటించింది. ఐఎండి అంచనాల ప్రకారం, త్వరలోనే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకూ విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రుతుపవనాల రాక కాస్త ఆలస్యమైంది. గత సంవత్సరం

- మిగతా 2లో

## బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం
### జంతర్ మంతర్‌లో అభిజిత్ దీప్కే

- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ తొలి నిరసన
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఫలితాల అవకతవకలపై ఆందోళన




దేశవ్యాప్త విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై యువత గళమెత్తింది. సోషల్ మీడియా వేదికగా సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) శనివారం ఢిల్లీలోని

- మిగతా 2లో




## బెదిరింపులు వద్దు.. ప్రశ్నించడం మా హక్కు

**పెన్ పవర్ డెస్క్:**సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉంటారు ప్రకాశ్ రాజ్ . సామాజిక, రాజకీయ అంశాలపై తన అభిప్రాయా లను నిర్మొహమాటంగా వెల్లడిస్తుంటారు. తాజాగా జనసేన పార్టీ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# టీడీపీకి అతి పెద్ద శాపం అదే... నమ్మిన వాళ్లే ముంచేస్తున్నారు

తెలుగుదేశం పార్టీకి తొలి నుంచి ఒక సెంటిమెంట్ ఉంది. రాజ్యసభ స్థానాలకు ఎవరిని ఎంపిక చేసినా వారు మాత్రం పార్టీకి నమ్మకంగా ఉండటంలేదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రాజ్యసభ సభ్యుల విషయంలో ఇదే జరుగుతుంది. ఎంపిక చేసి పెద్దల సభకు పంపండం, తర్వాత టీడీపీకి రాజీనామా చేసి వెళ్లడం కామన్ గా మారింది. ఒకరకంగా చెప్పాలంటే ఎన్టీఆర్ హయాం నుంచి నేటి చంద్రబాబు హయాం వరకూ అదే పరిస్థితి. ఒకరో ఇద్దరో నమ్మకంగా ఉన్నారు. సింహభాగం రాజ్యసభ సభ్యులు ఇతర పార్టీల్లోకి వెళ్లారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ లో టీడీపీకి మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయడంతో మరొకసారి ఈ చర్చ పార్టీలో జరుగుతుంది. అయితే పార్టీకి దీర్ఘకాలం పనిచేసిన వారు కూడా గుడ్ బై చెప్పి వెళ్లిపోవడంతో దీనిని సెంటిమెంట్ గానే చూస్తున్నారు.

**నాలుగు దశాబ్దాల హిస్టరీ...**

రాజ్యసభ పదవులు తెలుగుదేశం పార్టీకి కలసి రాలేదనే చెప్పడానికి గడచిన నాలుగు దశాబ్దాల చరిత్ర చూస్తే అర్థమవుతుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఇప్పటి వరకూ వీరితో కలిపి యాభై మందికి పైగానే పెద్దల సభకు వెళ్లారు. అయితే టీడీపీ ఓటమి కాగానే వారు పార్టీని వదిలి వెళుతున్నారు. ఎన్టీఆర్ సమయంలో నెంబర్ 2 గా ఉన్న ఉపేంద్ర రాజ్యసభ కు ఎన్నికయిన తర్వాత ఆయన కాంగ్రెస్ లోకి వెళ్లిపోయారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలోనూ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు కారణాలని చెబుతున్నారు. పార్టీ ఒకసారి ఓడిపోతే చాలు.. ఇక పెద్దల సభలో పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి మొన్నామధ్య కనిపించింది. పార్టీకి అత్యంత నమ్మకమైన సుజనా చౌదరి, సీఎం రమేష్ లు బీజేపీలోకి వెళ్లారు. టీజీ వెంకటేశ్, గరికపాటి మోహనరావు కూడా జంప్ కొట్టారు.

**ఎవరికీ మినహాయింపు లేదు...**

ఏకంగా రాజ్యసభలో టీడీపీని బీజేపీలో విలీనం చేశారంటే పెద్దల సభ టీడీపీకి కలసి రాలేదని అర్థమవుతుది.టీడీపీలో ఫైర్ బ్రాండ్ గా పేరు పొందిన రేణుకా చౌదరి లాంటి వారికి కూడా దీని నుంచి మినహాయింపు లేదు. అంతకు ముందు సి. రామచంద్రయ్య కూడా అదే పనిచేశారు. ఆయనను రాజ్యసభకు పంపినా ఆ తర్వాత ప్రజారాజ్యం పార్టీ, ఆ తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లి, అనంతరం వైసీపీలో చేరి తిరిగి టీడీపీలోకి వచ్చారు. రాజ్యసభ సభ్యుల ఎంపికలో లోపం ఎక్కడుందన్నది ఇప్పటికీ క్యాడర్ నుంచి లీడర్ల వరకూ అర్థం కాని ప్రశ్న. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత వరకూ పార్టీలో ఉంటారు. మరొకసారి రాజ్యసభ పదవిని రెన్యువల్ చేయకపోయినా, టీడీపీ ఓటమి పాలయినా సరే ఇక ఉండరు. దీంతో పెద్దల సభకు ఎంపిక చేయాలంటే నాయకత్వానికి ఒక సవాల్ గా మారింది. నాయకత్వం ఎన్ని రకాలుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు కూడా రాజ్యసభ విషయంలో మాత్రం వర్క్ అవుట్ కావడం లేదు.

# సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం

- మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

**'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది**

గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మద్యపానం నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలిచ్చి 'గొడ్డలి పార్టీ' చేతులెత్తేసింది. వారు చెప్పినవి చేయకపోగా, మేం నిర్వహిస్తున్న డీఎస్సీ-2025పై బురదజల్లారు. వివేకా హత్య విషయంలో ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో, డీఎస్సీ విషయంలోనూ అదే ప్రయత్నం చేశారు. కానీ మేం ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వడంతో వారు డిఫెన్స్‌లో పడ్డారు. ఫేక్ రాజకీయాలు చేయడమే గొడ్డలి పార్టీ సిద్ధాంతం" అని ఆయన విమర్శించారు. తాము అధికారంలో ఉన్నందున సహనంతో ఉంటామని, అయితే ప్రతిపక్షం ఆగడాలు శ్రుతి మించితే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "కూటమిగా వెళ్లాం కాబట్టే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచాం. ఓట్లు చీలకూడదనే బీజేపీతో పొత్తులో ఉన్నా టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. ఈ స్ఫూర్తిని క్షేత్రస్థాయిలో కార్యకర్తలు కొనసాగించాలి" అని సూచించారు."యుద్ధాన్ని గెలిపించే బాధ్యత నాది, నాతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత మీది. రాష్ట్రంలోని ప్రతి బూత్‌లో గతానికి మించి ఓట్లు రావాలి" అని శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గడప గడపకు వెళ్లి వివరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని ప్రజలకు గుర్తు చేయాలని ఆదేశించారు.

# కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్

కూటమి ప్రభుత్వ వైఫల్యాల వల్ల నిరుద్యోగులు, రైతులు తీవ్రంగా మోసపోయారని వైసీపీ నేత, మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. కాకినాడలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అందుకే అమరావతి రైతుల నుంచి డీఎస్సీ అభ్యర్థుల వరకు ప్రతి ఒక్కరూ ప్రస్తుతం జగన్ ను ఆశ్రయించి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారని తెలిపారు.ప్రస్తుత రాజకీయాలపై స్పందిస్తూ... కూటమి ప్రభుత్వాన్ని నిలదీసే ఏకైక మొనగాడు జగన్ మాత్రమేనని కొనియాడారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాల్టికీ ఎందుకు ఇవ్వలేదని నిలదీసిన ఆయన... ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని కూటమి నేతలు దేవుడిపై ప్రమాణం చేసి చెప్పగలరా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతూ ఈ ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని దుయ్యబట్టారు. జగన్ హయాంలో నడిచిన 'అమ్మఒడి'ని కాపీ కొట్టి 'తల్లికి వందనం'గా మార్చారని, అయినా దీని అమలులో కూటమి ప్రభుత్వం కనీసం పాస్ మార్కులు కూడా తెచ్చుకోలేకపోయిందన్నారు. ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఇస్తామన్న మాటను తుంగలో తొక్కి, ఏకంగా 20 లక్షల మంది విద్యార్థులకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. ఈ పథకానికి రూ.13,112 కోట్ల బడ్జెట్ అవసరమైతే, కేవలం రూ.8,456 కోట్లే కేటాయించడన్ని తప్పుబట్టారు.మరోవైపు, ఆక్వా రైతుల సమస్యలపై కూడా కన్నబాబు గళమెత్తారు. నిన్న జరిగిన ఎక్స్‌పోలో సీఎం చంద్రబాబు 'బ్లూ ఎకానమీ' అంటూ గొప్పలు చెప్పుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఆక్వా రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. జగన్ హయాంలో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీలు ఇచ్చి, రొయ్యల మేత ధరలు పెరగకుండా నియంత్రణలో ఉంచామని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం రాగానే రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సీజన్ వచ్చేసరికి రొయ్యల ధరలను దారుణంగా పడిపోయేలా చేసి రైతులను నష్టాల్లోకి నెట్టేశారని కన్నబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అసలు నువ్వెవరు? ప్రకాశ్ రాజ్‌పై జనసేన నేత తీవ్ర ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా సాగర్ ఘాటైన విమర్శలు చేశారు."జనసేన ఒంటరిగా పోటీ చేస్తుందో, పొత్తుతో వస్తుందో ఆయనకెందుకు? అసలు ప్రకాశ్ రాజ్ ఎవరు? మేమెందుకు ఆయనకు సమాధానం చెప్పాలి?" అని సాగర్ సూటిగా నిలదీశారు. ప్రశాంతంగా ఉన్నవారిని కెలకడం ప్రకాశ్ రాజ్‌కు అలవాటని ఆరోపించారు.గద్దర్ అంశంపై మాట్లాడుతూ, "గద్దర్‌ను ఎవరు ఉపయోగించుకున్నారు? పవన్ కల్యాణ్ జేబు నుంచి నేరుగా డబ్బులు తీసుకునేంత చనువు తనకు ఉందని స్వయంగా గద్దరే చెప్పారు" అని ఆయన గుర్తుచేశారు. ప్రకాశ్ రాజ్ వృత్తిపరమైన ప్రవర్తనను కూడా సాగర్ ప్రశ్నించారు. "అసలు ఆయన ఎప్పుడైనా షూటింగ్‌కు సమయానికి వచ్చారా? మీరు ఎంత సహృదయులో మీ చిత్ర పరిశ్రమ వారిని అడిగితే తెలుస్తుంది" అంటూ ఎద్దేవా చేశారు.

ఈ దేశానికి, ప్రత్యేకించి తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన తోడ్పాటు ఏమిటని సాగర్ ప్రశ్నించారు. "తెలంగాణ సాయుధ పోరాటం, రజాకార్ ఉద్యమంలో పాల్గొని కుటుంబాలను పోగొట్టుకుంది ప్రకాశ్ రాజా?" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అసలు నువ్వెవరు ప్రకాశ్ రాజ్?" అని సూటిగా ప్రశ్నించిన ఆయన, తెలంగాణకు ప్రకాశ్ రాజ్ చేసిన సేవ ఏంటని నిలదీశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చడం ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

# గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

కృష్ణా జిల్లా గుడివాడ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. పట్టణ అభివృద్ధిపై వస్తున్న విమర్శలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దీటుగా స్పందించారు. గుడివాడ అభివృద్ధిపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన సవాల్ విసిరారు.గుడివాడ 'హెడ్ వాటర్ వర్క్స్'లో కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.4.77 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రత్యర్థి పార్టీ చేస్తున్న నిరాధార విమర్శలను ప్రజలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, తాము కూడా వాటిని లెక్కచేయబోమని తేల్చిచెప్పారు. గుడివాడ ప్రజలకు దీర్ఘకాలికంగా సురక్షితమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో 35 వేల కుటుంబాలు ఉండగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 55 వేల కుటుంబాలకు సరిపడా నీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న సంపు పూర్తయితే హెడ్ వాటర్ వర్క్స్ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పనులన్నింటినీ ఇప్పుడు వేగంగా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. తాము కేవలం అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి కేంద్రీకరించామని, వ్యక్తిగత విమర్శలకు స్పందించాల్సిన అవసరం తమకు లేదని వెనిగండ్ల రాము కొట్టిపారేశారు.

# కోటిచెరువు భూమిని వెంటనే వెనక్కివ్వు

తెలంగాణ రాజకీయాల్లో భూకబ్జాల వ్యవహారం ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వర్సెస్ కవితగా మారి సరికొత్త వివాదానికి తెరలేపింది. హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కళ్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ ఆఫీస్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ ఆ భూమిని ఆక్రమించుకోలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన "తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ జాగీరా?" అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. "అవును, ఇది కచ్చితంగా మా జాగీరే! 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ ఇది. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదు" అని కవిత ప్రతిస్పందించారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్‌ను వాడుకుంటున్నారని విమర్శించారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఆమె ఒక ఆసక్తికరమైన పోలికను తెరపైకి తెచ్చారు. "అప్పట్లో ఖ.ం= (కేసీఆర్, టీ. హరీశ్ రావు, రామారావు (కల్వకుంట్ల తారకరామారావు) పాలన అనుకుంటే.. ఇప్పుడు కూడా నడుస్తోంది ఖ= (కొండారెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలన" అంటూ వ్యంగ్యంగా కామెంట్ చేశారు. గతంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా తలుపులే బార్లా తెరిచిందని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇలాగే అమ్మేసుకుంటూ పోతే రాబోయే తరాలకు ఏమీ మిగలదని, ఈ ల్యాండ్ స్కామ్‌లన్నింటినీ తాము త్వరలోనే బయటపెడతామని కవిత హెచ్చరించారు.

# బొద్దింకలు రోడ్డెక్కలేవన్నారు, ఇదిగో వచ్చేశాం

- మొదటి పేజీ తరువాయి

జంతర్ మంతర్ వద్ద తొలిసారిగా ప్రత్యక్ష నిరసన కార్యక్రమం చేపట్టింది. "బొద్దింకలు రోడ్డెక్కలేవన్న వారికి సమాధానంగానే మేము ఇక్కడికి వచ్చాం" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.నీట్-యూజీ పేపర్ లీక్, సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో దొర్లిన అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. ఈ నిరసనలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కూడా పాల్గొన్నారు.కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యువతలో కొందరిని ఉద్దేశించి 'బొద్దింకలు', 'పరాన్నజీవులు' అని చేసిన వ్యాఖ్యలకు వ్యంగ్య స్పందనగా ఈ పార్టీ ఆవిర్భవించింది. బోస్టన్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన అభిజీత్ దీప్కే ఈ అవమానాన్ని యువత నిరాశకు, నిరుద్యోగానికి ప్రతీకగా మార్చి ఆన్‌లైన్‌లో ఉద్యమాన్ని ప్రారంభించారు. అనతికాలంలోనే లక్షలాది మంది మద్దతుదారులను సంపాదించుకున్న ఈ ఉద్యమం, ఇప్పుడు క్షేత్రస్థాయి పోరాటంగా రూపాంతరం చెందింది.

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యారంగ డిజిటలైజేషన్ లోపాలను సరిదిద్దడం, విద్యార్థులపై మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టడం వంటివి తమ ప్రధాన డిమాండ్లని నిరసనకారులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఢిల్లీ పోలీసులు వెయ్యి మందికి పైగా సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

# స్పేర్‌సిటీ.. భవిష్యత్ టెక్నాలజీకి వారధి

- మొదటి పేజీ తరువాయి

మార్పులు, వాటి వినియోగంపై ఆయన ప్రత్యేకంగా ఆసక్తి కనబరిచారు.

ఈ సందర్భంగా, స్పేర్ బ్యాంక్‌కు చెందిన ఒక ప్రత్యేక ఏటీఎం మంత్రి లోకేష్ దృష్టిని ఆకర్షించింది. సాధారణ బ్యాంకింగ్ సేవలతో పాటు వ్యాధి నిర్ధారణ చేసే సామర్థ్యం ఉన్న ఈ ఏటీఎం పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఆవిష్కరణలను చూసి ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.అనంతరం, స్పేర్ సిటీ ప్రతినిధులు తమ సంస్థలో జరుగుతున్న పరిశోధనలు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్ అ డీ, క్వాంటం టెక్నాలజీ సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సేవలు, డిజిటల్ హెల్త్‌కేర్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఎడ్యుకేషన్ వంటి అంశాలపై తమకున్న పరిష్కారాలను వారు లోకేష్‌కు తెలిపారు.

# బెదిరింపులు వద్దు.. ప్రశ్నించడం మా హక్కు

- మొదటి పేజీ తరువాయి

ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు పెట్టిన పోస్ట్‌పై ప్రకాశ్ రాజ్ స్పందించారు.నాయకుడికి అన్నీ తెలుసని ఆయన మాటే శాసనం అని నాగబాబు పోస్ట్ పెట్టారు. నాయకుడి మాటను అనుసరించాలని కోరారు. ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేస్తూ పవన్ ఫొటోను పంచుకున్నారు. ఈ పోస్ట్‌కు ప్రకాశ్ రాజ్ స్పందించారు. "మీ సందేహాలను పక్కనపెట్టండి. మౌనంగా నాయకుడిని అనుసరించండి అనడంలో మీ ఉద్దేశం ఏంటి. మేం జంతువులం కాదు మౌనంగా బతకడానికి. ఈ బెదిరింపులు వద్దు నాగబాబు గారు. ప్రశ్నించడం మా హక్కు, ఏ నాయకుడైనా, నేనే నాయకుడిని అనుకున్నవాడైనా, సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## రుతుపవనాలు వచ్చేశాయి..

- మొదటి పేజీ తరువాయి

మే 26నే రుతుపవనాలు రాష్ట్రాన్ని పలకరించాయి.

ఈ నైరుతి రుతుపవనాల సీజన్‌లో (జూన్-సెప్టెంబర్ 2026) రాష్ట్రంలో వర్షపాతంపై ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఏర్పడవచ్చని, అంటే కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసి, ఆ తర్వాత కొంతకాలం వాతావరణం పొడిగా ఉండే సూచనలున్నాయని తెలిపారు. స్థానికంగా ఏర్పడే వాతావరణ మార్పుల వల్ల కురిసే వర్షాలు ఈ లోటును కొంతమేర భర్తీ చేయవచ్చని అంచనా వేశారు. మారుతున్న పరిస్థితులను గమనిస్తూ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు.

**వివిధ ప్రాంతాల్లో వర్షపాత అంచనాలు:**

సాధారణం కంటే తక్కువ: తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, పోలవరం, కర్నూలు, నంద్యాల, మార్కాపురం, అనంతపురం, కడప, నెల్లూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వర్షపాతం తక్కువగా ఉండనుంది.

సాధారణం కంటే ఎక్కువ: ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఈదురుగాలులతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సాధారణ వర్షపాతం: శ్రీకాకుళం, మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో సాధారణ స్థాయిలో వర్షాలు పడనున్నాయి.

**రానున్న రెండు రోజుల్లో వాతావరణం**

ఆది, సోమవారాల్లో కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, పల్నాడు, మార్కాపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడొచ్చు. అదే సమయంలో ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కోనసీమ సహా పలు జిల్లాల్లో 42-44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడరాదని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

# హైదరాబాద్‌కు ఉపశమనం.. పలు ప్రాంతాల్లో వర్షం

- మొదటి పేజీ తరువాయి

నుంచి మోస్తరు వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

శనివారం సాయంత్రం గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో వేడిమి నుంచి నగరవాసులకు ఊరట లభించింది. ఇక పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలోని కొహెడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

# ఐదు వేల ఇళ్లకు టోకరా పెట్టిన వీర ప్రతాప్ రెడ్డి ధైర్యం గొప్పది

## – 14 కోట్లు డ్రా చేసుకున్న ఘనుడు ఆయన

**ఐదు వేల కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**

**రూ. 42.49 కోట్ల బృహత్తర తాగునీటి పథకానికి శంకుస్థాపన**

**గత పాలకుల వైఫల్యాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని విమర్శ**






కావలి, జూన్ 6 (పెన్ పవర్): కావలి పట్టణ ప్రజలకు మెరుగైన, నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు రూ. 42.49 కోట్ల వ్యయంతో చేపడుతున్న బృహత్తర తాగునీటి పథకానికి శనివారం స్థానిక ఐడీఎస్ఎంటీ ప్లాట్స్ ప్రాంతంలోని మున్సిపల్ నీటి నిల్వ కేంద్రం వద్ద శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యూఐడీఎఫ్ నిధుల ద్వారా రూ. 22.80 కోట్లు, అమృత్–2.0 పథకం కింద రూ. 14.50 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 5.19 కోట్లతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు తెలిపారు. కావలి ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడంతో పాటు బడుగు, బలహీన వర్గాల కాలనీలకు పూర్తి స్థాయిలో నీటి సౌకర్యాలు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. గతంలో అమృత్–1 పథకం అమలులో తీవ్ర లోపాలు చోటుచేసుకున్నాయని, వేలాది కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు.

అమృత్–2 పథకం కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి, కేటాయించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పారదర్శకంగా పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు చూపించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీధర్, డీఈ సాయిరాం కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, మాజీ సోమశిల చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి తట్టవర్తి రమేష్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తట్టవర్తి వాసు, మాజీ కౌన్సిలర్ మదన్ మోహన్ రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్ట్ సేవలు అభినందనీయం-- ఎమ్మెల్యే విజయశ్రీ

పెళ్లకూరు,పెన్ పవర్, జూన్ 6 మండలంలో స్థానికంగా ఉన్న పెళ్లకూరులో ఉన్న చాగాణం లలితమ్మ –భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ నందు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులకు శనివారం నాడు సూళ్లూరుపేట నియోజకవర్గం శాసన సభ్యురాలు నెలవల.విజయశ్రీ చేతుల మీదుగా ట్రస్ట్ ఎండి చాగణం గౌరీ శంకర్ సర్టిఫికెట్లను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల. విజయశ్రీ మాట్లాడుతూ ట్రస్ట్ ఎండి గౌరీ శంకర్ తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తన స్వగ్రామమైన పెళ్లకూరులో మెమోరియల్ ట్రస్ట్ ను స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు, మహిళలకు వృత్తి విద్య నందు శిక్షణ ఇచ్చి ఉపాధి చూపిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయన అభినందనీయుడని ప్రశంసించారు. అంతేకాకుండా ట్రస్టు ద్వారా ఆయన చేపడుతున్న విద్య,వైద్యం, ఉపాధి, ఆరోగ్యం విషయంలో ప్రజలకు అనేక రకాల సేవలను అందిస్తూ మండలంలోను, నియోజకవర్గంలోనే కాకుండా పక్క జిల్లాలకు కూడా ఆయన సేవలను విస్తరించడం నిజంగా ప్రశంసనీయమని కొనియాడారు . ఈ సందర్భంగా ఆమె ట్రస్ట్ లో చేపడుతున్న డ్రైవింగ్, బ్యూటీషియన్, కుట్టు మిషన్, కంప్యూటర్ శిక్షణ, మగ్గం వర్క్, మొదలైన శిక్షణా తరగతి గదులను, ఆరోగ్యపరంగా నిర్వహిస్తున్న రక్త పరీక్ష కేంద్రాలను అంతేగాకుండా ఉచితంగా ప్రజల కోసం ఏర్పాటుచేసిన కళ్యాణ మండపంను పరిశీలించారు. ప్రత్యేకించి నిరుద్యోగ మహిళల కోసం ట్రస్ట్ చేపడుతున్న ఉచిత శిక్షణ శిబిరాలను చూసి మహిళలు అందరూ ఇలాంటి అవకాశాలను వినియోగించుకుని స్వశక్తితో తమ కాళ్లపై తమ నిలబడి జీవితంలో పైకి ఎదగాలని



కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఎండి చాగణం. గౌరీ శంకర్, సీఈవో పెనుబల్లి. సీతారామ నాయుడు మండల తెదేపా నాయకులు సంచి. కృష్ణయ్య , పేరం రమేష్ నాయుడు, వేలూరు. మురళీకృష్ణారెడ్డి, శిరసనం భేటీ. చైతన్య కృష్ణారెడ్డి, పునబాక. పోలయ్య పాల్గొన్నారు.

# చిన్నారుల సమగ్ర అభివృద్ధికి నవ చేతన

# యాప్ అంగన్వాడి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూన్ 6. చిన్నారుల మానసిక శారీరక ఎదుగుదలకు ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తామని వాటి పరిరక్షణ కోసం నవ చైతన్య ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ శారద పేర్కొన్నారు శనివారం స్థానిక డి ఎల్ ఎన్ ఆర్ హై స్కూల్లో అంగన్వాడి కార్యకర్తలకు నవచేతన యాప్ రూపకల్పన పై శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా కోవూరు ప్రాజెక్ట్ సిడి పి ఓ టి శారద చిన్నారుల గురించి మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రవేశపెట్టిన ఒక కీలకమైన బాల్య ఆరంభం అభివృద్ధి కార్యక్రమం నవ చేతన యాప్ అన్నారు గర్భధారణ సమయం నుండి పిల్లలకు ఆరు సంవత్సరాల వచ్చేవరకు వారి మెదడు ఎదుగుదలను మరియు శారీరక మానసిక వికాసాన్ని పర్యవేక్షించడం యాప్ ముఖ్య ఉద్దేశం ఏమైనా లోపాలు లేదా ఆలస్యాలను ముందుగానే గుర్తించి సరైన సమయంలో అవసరమైన వైద్య సహాయం అందించడానికి అంగన్వాడి ఆరోగ్య శాఖ కార్యకర్తలు వీలుబ్రోలు యాప్ను ఉపయోగిస్తున్నారని తెలిపారు పిల్లలు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందినీ తెలిపారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జమీమా ఐసిడిఎస్ సూపర్వైజర్ డి పద్మావతి ఐసిడిఎస్ సూపర్వైజర్ టి నాగభూషణమ్మా పేర్కొన్నారు

# కావలిలో 10వ విద్యార్థులకు ఘనంగా 'ప్రతిభా తరగతుల పురస్కారాలు'

నెల్లూరు. పెన్ పవర్,జూన్ 6 కావలి: "విద్యతో వస్తుంది... వివేకం తె సౌభాగ్యం" అనే నానుడిని నిజం చేస్తూ, ఇటీవల జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కావలిలో 'ప్రతిభా వివేకం' లభించింది. జూన్ 6వ తేదీన స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు, సేవాతత్పరులు ఎంవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన సతీమణి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు స్వర్గీయ రత్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు ఎస్కే బాషా ఈ అధ్యక్షత వహించారు.

**పురస్కారాల ప్రదానం**

కావలి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ) వీవీ రమణ కుమార్, 2 టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. గిరిబాబు ఈ ముఖ్య సూచనగా. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు వీరి చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, జిజ్ఞాస పెంపొందించాలంటే సదుద్దేశంతో 500 మందికి పైగా మార్కులు సాధించి 27 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, 14 మంది ప్రైవేట్ పాఠశాలలకు ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. కావలి డివిజన్ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు: ప్రభుత్వ పాఠశాలల విభాగం: వై. నీతు ప్రియ రెడ్డి: 590/600 (4వ వార్డు పురపాలక ఉన్నత పాఠశాల) ఎస్.డి. రోషిణి: 590/600 (8వ వార్డు పురపాలక ఉన్నత పాఠశాల) ఎం.వీ. సాయి కిరణ్: 589/600




(8వ వార్డు పురపాలక ఉన్నత పాఠశాల) ప్రైవేట్ పాఠశాలల విభాగం: బి. శరణ్య: 597/600 (శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల) కె.వి. అక్షజరెడ్డి: 595/600 (ఐఏఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్)

కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు: ఈ కార్యక్రమంలో ఆపద్బాంధవ సేవా ట్రస్ట్ ప్రతినిధి డి. మధుసూదన్ రావు, విశ్వశాంతి రమణయ్య, మీకోసం సేవా సంస్థ రాయపాటి దిలీప్ కుమార్, పీవీ రమణయ్య, ప్రగతి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, విశ్రాంత హెడ్ మాస్టర్ ఎం. అజిత్ బాబు, టైం టు హెల్ప్ ట్రస్ట్ నందిపాటి రమేష్, లోకసత్తా ఎం. మాలకొండారెడ్డి, గుడ్మెన్ ఎస్. బ్రహ్మయ్య, సామాజిక సేవకులు మహబూబ్ బాషా, బాబ్జీ, చిరంజీవిలతో పాటు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# నెర్రి కాలవను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ

సూళ్లూరుపేట, పెన్ పవర్, జూన్ 6 తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పట్టణ సమీపంలోని నెర్రికాలువను శనివారం శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ సంబంధిత ప్రభుత్వ అధికారులతో కలిసి సందర్శించి,కాలువ ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు..... ఈ సందర్భంగా కాలువ నిర్వహణ, నీటి ప్రవాహం, పరిసర ప్రాంతాల పరిస్థితులు మరియు ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే విజయ శ్రీ ఆదేశించారు.... అనంతరం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన




చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.....

# ప్రభుత్వ విద్యలో నవశకం-మంత్రి నారాయణ.

**మూలా పేటలో 20 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో డీఎస్ఆర్ హైస్కూల్**

**ప్రభుత్వ స్కూల్లో రోబోటిక్ ల్యాబ్.**

**అంతర్జాతీయ ప్రమాణాలతో ముస్తాబౌతున్న పాఠశాల.**

**8 నెల కాలంలో అంతర్జాతీయ స్థాయి స్కూల్ సిద్ధం**





నెల్లూరు. పెన్ పవర్,జూన్ 6 విద్యావ్యవస్థలో సరికొత్త చరిత్ర సృష్టిస్తూ నెల్లూరు లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొస్తున్న విప్లవాత్మక సంస్కరణల్లో భాగంగా, నెల్లూరు 39వ డివిజన్ మూలాపేటలో దాదాపు 20 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమౌతున్న డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. గత ప్రభుత్వం మూసివేసిన విఆర్ హైస్కూల్ ని అంతర్జాతీయ ప్రమాణాలతో పునఃప్రారంభించారు. అదే స్ఫూర్తితో, ఇప్పుడు మూలపేటలో ఒక కోటలాంటి అద్భుతమైన స్కూల్ బిల్డింగ్‌ను డిఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు.

పనులను శనివారం మంత్రి నారాయణ పర్యవేక్షించారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త ప్రాంగణంలో, 24,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 హైటెక్ క్లాస్‌రూమ్‌లను కేవలం ఎనిమిది నెలల రికార్డు కాలపరిమితిలో పూర్తి చేసి ఫర్నిచర్‌ను సిద్ధం చేశారన్నారు. ఇందులో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ ల్యాబ్‌లతో పాటు రాష్ట్రంలోనే అత్యంత ఆధునికమైన రోబోటిక్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం విశేషం అన్నారు.

కేవలం చదువే కాకుండా, పిల్లల ఆటల కోసం బెంగళూరు నిపుణులతో ప్రత్యేకంగా సింథటిక్ ఎనామిల్ కోటింగ్ వేయించిన కబడ్డీ కోర్ట్, క్రికెట్ నెట్, హాఫ్ బాస్కెట్‌బాల్, రెండు బాడ్మింటన్ కోర్టులు మరియు చిల్డ్రన్ ప్లే ఏరియాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారన్నారు. సురక్షితమైన ఆర్వో ప్లాంట్ తాగునీరు, ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక సిక్ రూమ్ కూడా ఇక్కడ అందుబాటులోకి వచ్చాయన్నారు. స్కూల్ ఆధునీకరణకు ముందుకొచ్చి శరవేగంగా పనులు పూర్తి చేసిన సుధాకర్ రెడ్డిని ,వారి కుటుంబ సభ్యులను మంత్రి నారాయణ అభినందించారు. డిఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో మంత్రి నారాయణ హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా ఫోన్ చేసి నెల్లూరు మున్సిపల్ స్కూల్స్ డెవలప్‌మెంట్ ప్రపోజల్ పెట్టారన్నారు. ఆయనపై గౌరవంతో మూలాపేట హైస్కూల్‌ను 8 నెలల్లో కార్పొరేట్ స్థాయిలో నిర్మించడానికి అంగీకరించానని తెలిపారు. 2.5 ఎకరాల స్థలంలో, మొదటి ఫేస్ కింద 24,000 చదరపు అడుగుల్లో 14 క్లాస్‌రూమ్‌లు, అధునాతన ల్యాబ్స్, ఆర్ఓ ప్లాంట్, సిక్ రూమ్‌లతో పాటు బెంగళూరు నిపుణులతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కబడ్డీ, క్రికెట్, బాస్కెట్‌బాల్, బాడ్మింటన్ కోర్టులను సిద్ధం చేశామన్నారు. ఈ నిర్మాణానికి సహకరించిన మూలాపేట ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, నెల్లూరులో ఎంతోమంది ఉన్నా తనను నమ్మి ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన మంత్రి నారాయణ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత అశోక్ ,39వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ అన్నంగి ప్రసాద్,అధ్యక్షుడు మనోహర్,జనరల్ సెక్రటరీ మధురెడ్డి,ఉపాధ్యక్షుడు మురళి,దీనదయాళ్,విజయ్,నాని స్థానిక ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటర్నెట్ సమస్యతో ప్రజల ఇబ్బందులు..!



నెల్లూరు (పలనాడు జ్యోతి) నెల్లూరు జిల్లా అల్లూరు మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలు ఆలస్యమవడంతో ప్రజలు తమ హక్కులను సకాలంలో వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్తుల రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్ ప్రాసెసింగ్ వంటి కీలక సేవలు ఇంటర్నెట్ సమస్యల కారణంగా నిలిచిపోతుండడంతో ప్రజలు పలుమార్లు కార్యాలయానికి రావాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని మెరుగుపరచి ప్రజలకు అంతరాయం లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పెసర్లంక లో రైతులకు అవగాహన సదస్సు--ఏవో బ్రహ్మ రెడ్డి




భట్టిప్రోలు, పెన్ పవర్ (జూన్ 06) భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో పంట సాగుదారుల హక్కు పత్రాల పై అవగాహన సదస్సు మరియు ఖేత్ బచావో అభియాన్(పొలం సంరక్షణ ప్రచారం) నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెసర్లంక విఆర్ఓ ఎం జక్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కౌలు రైతు చట్టం 2019 ప్రకారం కౌలు రైతులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందటానికి ఈ కార్డు తీసుకున్న ప్రతి కౌలు రైతు కి 11 నెలల వరకు పండించే పంట పై హక్కు కలిగి వుంటాడని తెలిపారు. ఈ సి సి ఆర్ సి కార్డులు అందజేయుటకు కౌలు రైతులు ను గుర్తించి ప్రతి కౌలు రైతు కి సి సి ఆర్ సి కార్డ్ అందజేయాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి భట్టిప్రోలు బి.బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ ఈ కౌలు రైతు కార్డ్ పొందటం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వచ్చే అవకాశం ఉంటుందని అందులో అన్నదాత సుఖీభవ,సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా,పంట నష్ట పరిహారం, పండించిన పంట అమ్ముకోవడానికి , పంట రుణాలు పొందటానికి ఈ కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. కావున గ్రామాలలో ప్రతి కౌలు రైతు ఈ సి సి ఆర్ సి కార్డు పొందాలని తెలిపారు. ఈ కార్డు కోసం కౌలు రైతులు మీ సచివాలయం లోని గ్రామ రెవెన్యూ అధికారి నీ సంప్రదించాలని కోరారు. అదేవిదంగా ఈ కార్యక్రమం గ్రామ స్థాయిలో రైతులకు ప్రత్యక్షంగా ఈ క్రింది కీలక అంశాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎరువుల సమర్థవంతమైన మరియు సమతుల్య వినియోగం మరియు అధిక ఎరువుల వాడకం తగ్గింపు. నానో ఎరువులు మరియు జీవ ఎరువుల ప్రోత్సాహం. శాస్త్రీయ పోషక యాజమాన్యం కోసం మట్టి నమూనాల సేకరణ మరియు మట్టి పరీక్ష. మట్టి పరీక్ష ఆధారిత ఎరువుల వినియోగం. మట్టి ఆరోగ్యం ఆధారంగా అనువైన మరియు లాభదాయక పంటల గుర్తింపు. పప్పుధాన్యాల మిషన్,నూనెగింజల మిషన్ మరియు పత్తి మిషన్‌పై అవగాహన. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం. రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రభుత్వ పథకాలు మరియు కార్యక్రమాలపై అవగాహన. పి ఎం-కిసాన్ పథకం మరియు అన్నదాత సుఖీభవ కార్యక్రమం. యూరియా ఆన్‌లైన్ పంపిణీ మరియు యూరియా,డి ఏ పి వ్యవసాయేతర అవసరాలకు మళ్లింపును నిరోధించడానికి ఎరువుల విక్రయాల పర్యవేక్షణ. సూక్ష్మపోషకాల వినియోగం మరియు సమగ్ర పోషక యాజమాన్యం ప్రోత్సాహం. సమతుల్య ఎరువులు,పచ్చిరొట్ట ఎరువులు మరియు సేంద్రియ/జీవ ఉత్పత్తుల వినియోగంలో రైతులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంపొందించడం. జరుగుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు జ్యోతి,గ్రామ రెవెన్యూ అధికారి మండ్రు జక్రయ్య,మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి




బాపట్ల:( పెన్ పవర్):జూన్ 6: జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష కమిటీ జిల్లా లెవల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జిల్లాలో వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు బ్యాంకులు అధిక ప్రాధాన్యతనిస్తూ రుణాల పంపిణీ చేపట్టాలని సూచించారు. ప్రాధాన్యతా రంగాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు బ్యాంకులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేసి, ఆర్థిక సాధికారతకు దోహదపడాలని బ్యాంకర్లను ఆదేశించారు. ముఖ్యంగా రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు అనుసంధానం, మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బ్యాంకుల వారీగా పనితీరును నివేదికల మేరకు సమీక్షించి, లక్ష్యాల సాధనలో వెనుకబడిన బ్యాంకు మేనేజర్లకు ఆయన పలు సూచనలు చేశారు. రుణ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్ల జిల్లాలో టూరిజం దినదినాభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. టూరిజం లో బ్యాంకులు పెట్టుబడులకు ఇది సరైన సమయమని ఆయన అన్నారు. జిల్లాలో 85 కిలోమీటర్ల బాపట్ల తీరం విస్తరించి ఉందని, బాపట్ల సూర్యలంక బీచ్ ని గోవా తరహాలో రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. సూర్యలంక బీచ్ లో జెట్ స్కి, అడ్వెంచర్స్, తీర ప్రాంత చేపల ఆహార పదార్థాల షాపులు, స్వయం సహాయక బృందాలచే జ్యూట్ బ్యాగులు, టోపీలు, కీ చైన్లు, మగ్గులు మొదలైనవి అమ్మకాలు చేస్తున్నట్లు వీరందరికీ రుణాలు మంజూరు చేయాలని ఆయన బ్యాంకర్లను కోరారు. రుణాల వసూళ్ల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. బ్యాంకర్లు లోన్లను ఒకే సెక్టార్ లో ఎక్కువ మందికి మంజూరు చేయకుండా వివిధ రకాల విభాగాలలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ బ్యాంకర్లకు తెలిపారు. ఒక మండలంలో ఒక సెక్టార్లో ఒకరికి లేదా ఇద్దరికీ మాత్రమే లోన్ మంజూరు చేయాలని మిగిలిన వారికి వేరువేరు సెక్టార్లలో లోన్లు మంజూరు చేసిన వారి వ్యాపారాలు వృద్ధి చెందుటకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఒకే సెక్టార్ లో ఎక్కువ మందికి లోన్లు మంజూరు చేసిన అక్కడ వ్యాపారం వృద్ధి చెందదని ఆయన చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు వారి ఆలోచనలను మెరుగుపరుచుకొని వృద్ధి చెందాలని ఆయన అన్నారు. నాబార్డ్ నిధులను కేవలం వ్యవసాయ రంగాలకే కాకుండా జిల్లా పాలన దిశగా రుణాలు మంజూరు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన క్రెడిట్ ప్లాన్, వివిధ రంగాలకు అందించిన రుణాలు, డిపాజిట్లు, రుణాల-డిపాజిట్ల నిష్పత్తి, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు పురోగతి తదితర అంశాలను సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సింగయ్య, వ్యవసాయ శాఖ జెడి ఈ లక్ష్మి , జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుగోపాల్, పరిశ్రమలు మేనేజర్ రామకృష్ణ, మత్స్యశాఖ ఉపసంచాలకులు గాలి దేవుడు, పిడి మెప్మా ఆనంద పాల్, లీ బాక్ మేనేజర్ శివకృష్ణ, యూనియన్ బ్యాంక్ రీజనల్ కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఆర్బిఐ ఎండిఓ ఎలమంద, నాబార్డ్ డీడీఎం రవికుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ బ్యాంకుల జిల్లా సమన్వయకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# పెరగనున్న భూగర్భ జలాలు - చిగురిస్తున్న రైతుల ఆశలు






బాపట్ల :( పెన్ పవర్).06 వ తేదీ వర్షం నీటిని భద్రపరిచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సఫలీకృతం కానుంది. ఒట్టి పోయిన కాల్వలు, బీడు భూములలో జలధారలు ప్రవహించేందుకు రూపొందించిన ప్రణాళికలు కార్యరూపం దాలుస్తున్నాయి. జలభద్రత కోసం ప్రభుత్వం చేపట్టిన జలధార జలహారతి కార్యక్రమాలు రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న రైతుల ఆశలను చిగురింప చేస్తున్నాయి. ప్రభుత్వ చర్యలతో పంట కాల్వలు పునర్జీవం పోసుకుంటున్నాయి. వర్షపు నీటిని భద్రం చేయాలనే దృక్పథంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తమ వంతు బాధ్యతగా మేము సైతం అంటూ రైతులు శ్రమదానం చేస్తున్నారు. ఒట్టి పోయిన కాల్వల్లో పూడికతీత, చిల్ల చెట్లు తొలగించడం వంటి మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో ఆ కాల్వల్లో సమృద్ధిగా జలాలు ప్రవహించనున్నాయి.

వర్షాన్ని ఒడిసిపట్టేందుకు...

వర్షం నీటిని ఒడిసిపట్టేందుకు అధికారులు, రైతులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామంలో పంట కాల్వల పునరుద్ధరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాగునీటి సంఘాలకు ఆ బాధ్యతను అప్పగించింది. అంతమాత్రమే గాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు చేయూతనందిస్తుంది. దీంతో గ్రామంలోని రైతులంతా కలిసి కాల్వ పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. కురిసిన ప్రతి వర్షపు నీటి బిందువును భద్రం చేయాలని కంకణ బద్ధులయ్యారు. గ్రామంలో 40 మంది ఏ చెయ్యి చెయ్యి కలిపి భుజం తట్టుకుని వడివడిగా అడుగులు ముందుకు వేస్తున్నారు. తట్టా బుట్టా చేతబూని గుణపాలు చెలకపారలతో పనులు చేస్తున్నారు.

తూములు శుభ్రం

జలధార జలహారతి కార్యక్రమం రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుతో రైతులంతా ఏకమై పూడిపోయిన కాల్వలో మట్టి, చిల్లచెట్లు, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఒక కిలోమీటరు పొడవునా, 3 మీటర్ల వెడల్పు, ఒకటిన్నర మీటర్ లోతున కాల్వ తవ్వకాల పనులు చేపట్టారు. ఆ కాల్వలో పూడిపోయిన తూములు, కల్వర్టులు శుభ్రం చేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతిలో కాల్వ పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి.

బోర్లకు రీఛార్జ్

రైతులంతా కలిసి చేపట్టిన కాల్వ పునరుద్ధరణ పనులతో అడుగంటిన భూగర్భ జలాలు మరింత పెరగనున్నాయి. వర్షం కురిస్తే ఆ జలాలు కాల్వలోకి ప్రవహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా వర్షం నీరు భూముల్లోకి ఇంకే అవకాశాలున్నాయి. తద్వారా 80 ఎకరాలకు సాగునీరు అందనుంది. 48 మంది రైతులు ప్రత్యక్షంగా లబ్ధి పొందనున్నారు. ఆ కాల్వ ద్వారా వారికి సాగునీరు అందించే దిశగా పనులు జరుగుతున్నాయి. కాల్వ పునరుద్ధరణ పనులతో 18 బోరు బావులు రీఛార్జ్ కానున్నాయి. కురిసిన వర్షం నీరు భూమిలోకి ఇంకితే ఆ ప్రాంతంలో ఇక సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కానుంది. దీంతో భవిష్యత్తులో మాకెంతో ప్రయోజనం చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు. పంటల సాగు పెరగనుండగా, అదే క్రమంలో పంటల దిగుబడి పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సముద్రంలో వేటకు వెళ్లి నీటమునిగి వృద్ధ జాలరి మృతి

శింగరాయకొండ (ప్రకాశం) :,పెన్ పవర్ (జూన్ 06) సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి వృద్ధ జాలరి మృతి చెందిన ఘటన శుక్రవారం పాకల గ్రామంలో జరిగింది. శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో మత్స్యకారుడు కూర కోసం సముద్రంలో కలిసే పాలేరు పరనీటి దగ్గర చేపల కోసం వెళ్లగా, అక్కడ వేట చేస్తున్న సమయంలో జాలరాములు (60) ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మరణించాడు. లోపల ఉన్న మత్స్యకారులను తోటి మత్స్యకారులు బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని ఎస్సై లేళ్ల సుధీర్ కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చెస్.. యువతకు జీవిత పాఠాలు నేర్పే గొప్ప విద్య మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ





గుంటూరు, పెన్ పవర్, జూన్, 06, చెస్ అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాదని, ఆలోచనా శక్తి, సహనం, వ్యూహాత్మక దృక్పథాన్ని పెంపొందించే గొప్ప విద్య అని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్, విఐటీ-ఏపీ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చిన క్రీడాకారులకు డా. రాయపాటి శైలజ స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక వసతుల కల్పనకు కృషి జరుగుతోందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాంటి సమయంలో అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు అమరావతి ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుతం భారత చెస్ క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తున్నారని డా. రాయపాటి శైలజ తెలిపారు. కోనేరు హంపి, హారిక ద్రోణవల్లి, దివ్య దేశ్‌ముఖ్, డి. గుకేష్, ఆర్. ప్రజ్ఞానంద వంటి క్రీడాకారులు ప్రపంచ వేదికపై భారత జెండాను రెపరెపలాడిస్తున్నారని, వారి విజయాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. చెస్ ఆట జీవితానికి ఎన్నో విలువైన పాఠాలను నేర్పుతుందని ఆమె అన్నారు. చెస్ బోర్డుపై రాజు, మంత్రి, గుర్రం, ఏనుగు వంటి పావులు ఉన్నప్పటికీ గెలుపు వాటి శక్తిపై కాకుండా వాటిని సరైన సమయంలో ఎలా ఉపయోగించామన్న దానిపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. జీవితంలో కూడా అలాగే ఒక అపజయం ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా పరిస్థితులను విశ్లేషించి మళ్లీ ప్రయత్నించాలని యువతకు సూచించారు. ప్రతి ఒక్కరిలో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఇతరులతో పోల్చుకుని నిరాశ చెందకుండా తమ సామర్థ్యాలను గుర్తించి లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని డా. రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. చదువు, క్రీడలు, కళలు లేదా ఇతర రంగాలు ఏవైనా సరే కృషి, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తే విజయం తప్పక లభిస్తుందని పేర్కొన్నారు. నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నిరాకరించాలని ఆమె సూచించారు. "సే నో టు డ్రగ్స్" అనే సందేశాన్ని ప్రతి యువకుడు ఆచరణలో పెట్టాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, క్రీడాస్ఫూర్తి, సానుకూల దృక్పథం యువతను ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని తెలిపారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అదే విధంగా క్రీడల్లో కూడా మరింత మంది బాలికలు ముందుకు రావాలని డా. రాయపాటి శైలజ ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి మరిన్ని విజయాలు అందించేలా యువ క్రీడాకారులు కృషి చేయాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి శుభాకాంక్షలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. విజేతలకు ముందస్తు అభినందనలు తెలియజేస్తూ, ప్రతి క్రీడాకారుడు తన ప్రతిభతో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, పెన్ పవర్, జూన్, 06, సమాజంలోని ప్రతి వర్గానికి యోగా పట్ల అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్ర-2026లో భాగంగా ఈ నెల 7 నుంచి యోగా పోటీలు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్ - గ్రాస్‌రూట్స్ వెల్‌నెస్ ఇతివృత్తంతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విజేతలు మండల స్థాయికి, మండలస్థాయిలో విజేతలు జిల్లాస్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు యునిటీ త్రో యోగా-బ్రిడ్జింగ్ కమ్యూనిటీస్ థీమ్‌తో మండలస్థాయిలో, ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యోగా అండ్ యూత్ - బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో జిల్లాస్థాయిలో, ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర-ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత కేటగిరీ, గ్రూపు కేటగిరీలో పోటీలు ఉంటాయని.. వ్యక్తిగత కేటగిరీలో ఆసనాల ప్రదర్శన, ప్రాణాయామం ప్రదర్శనలు, గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూపుయోగా ఉంటుందన్నారు. యోగా సాంగ్, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా ఎస్సే పోటీలు కూడా ఉంటాయని వివరించారు. జూనియర్ (10-18 ఏళ్లు), యంగ్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జ్ఞానాధారిత పోటీలు మినహా మిగిలిన పోటీలను పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సత్కరించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర పోటీలకు సంబంధించిన పూర్తి వివరాలకు 84980 12833, 83413 64185 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు...

# ఓటర్ల జాబితా సవరణపై బూత్ కన్వీనర్లకు అవగాహన.



భట్టిప్రోలు,పెన్ పవర్ (జూన్ 06) ఎన్నికల కమిషన్ ఈనెల 15వ తేదీ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ)కు సంబంధించి తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో జరిగిన భట్టిప్రోలు,అద్దేపల్లి, ఐలవరం గ్రామాలకు చెందిన టిడిపి బూత్ కన్వీనర్ మరియు కో కన్వీనర్లకు జరిగిన అవగాహన సదస్సు కు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా భట్టిప్రోలు క్లస్టర్ నెంబరు10 కి సంబంధించిన,ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం గురించి సవివరమైనటువంటి విషయాలను బూత్ కన్వీనర్లకు,కో కన్వీనర్లకు వివరించటం జరిగింది. 15వ తారీకు నుండి జరిగే ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకి సంబంధించిన పూర్తి విషయాలను బూత్ కన్వీనర్లకు తెలియజేసి బిఎల్వోలతో కలిసి ఓటర్ల పరిశీలనలో పాల్గొనుటకు తీసుకోవలసిన చర్యలు గురించి సాయిబాబా వివరించారు. ఈ సమావేశంలో దీపాల శివప్రసాద్,పెరికల అజయ్,డోగుపర్తి వెంకట గోపాలరావులు పాల్గున్నారు.

# మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి లేకపోతే చలో ఢిల్లీ : ఎఐఎస్ఎఫ్

విజయనగరం కోట :పెన్ పవర్,జూన్ 6 నీట్ పేపర్ లీకేజీ విషయంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్ వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాసర్ జి మాట్లాడుతూ .... నీట్ సంవత్సర క్రితమే లీకేజీ జరిగినప్పటికీ ఎన్డీఏ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఇది ముమ్మాటికి ఎన్డీఏ ప్రభుత్వం వైఫల్యమేనన్నారు. విద్యాశాఖ మంత్రిపై చర్యలు తీసుకోకపోతే ఆయన వెంటనే రాజీనామా చేయకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరిక చేశారు.

# అక్రమ ఇసుక తవ్వకాలు





కర్లపాలెం: ( పెన్ పవర్ ) జూన్06 కర్లపాలెం మండల పరిధిలోని నర్రవారిపాలెం గ్రామపంచాయతీ శివారులో ఉన్న మరికట్టవ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 296లో అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తన పొలంలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యకు పరిష్కారం లభించలేదని ఆమె వాపోయారు. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయని, పంటలకు నష్టం కలుగుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వృద్ధురాలు కోరారు.

ఇదిలా ఉండగా, సంఘటన స్థలాన్ని పరిశీలించిన డ్రైనేజీ శాఖ అధికారులు అక్రమ ఇసుక తవ్వకాల కోసం డ్రైనేజీ ప్రవాహానికి అడ్డుగా నిర్మించిన కట్టను వెంటనే తొలగించాలని సంబంధిత వ్యక్తులను ఆదేశించారు. కట్టను తొలగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డ్రైనేజీ ఏఈ హెచ్చరించారు. అక్రమ ఇసుక తవ్వకాలపై సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకుని రైతుల భూములను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# యోగాంధ్ర-2026 ను విజయవంతం చేయండి

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపు

నరసరావుపేట, పెన్ పవర్ జూన్ 06: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2026 కార్యక్రమం రాష్ట్రంలో యోగాను కేవలం వ్యాయామంగా కాకుండా ఒక సామాజిక ఉద్యమంగా మార్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ యోగాంధ్ర-2026 విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ఆధునిక జీవనశైలి వల్ల వచ్చే వ్యాధులను నివారించడం, వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా జీవించేలా ప్రజలను సన్నద్ధం చేయడమే ఈ బృహత్తర కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా యోగా సంస్కృతిని ప్రజల దైనందిన జీవితంలో భాగం చేయాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. జూన్ 6 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల సచివాలయాల ద్వారా కోటి మంది ప్రజలను యోగా భాగస్వాములుగా చేయాలని మా ప్రయత్నం అని వివరించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కనీసం కోటి మంది ప్రజలు యోగాలో భాగస్వాములవ్వాలని ప్రభుత్వం భావిస్తుందని అన్నారు. అమరావతిలోని కృష్ణా నది వెస్ట్ బైపాస్ బ్రిడ్జిపై సుమారు 25,000 మందితో భారీ మెగా యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు స్ఫూర్తి చూపించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు సహకారంతో 21 వ్యాధుల నివారణకు సంబంధించిన 168 ఉచిత యోగాసనాల వీడియోలు తయారు చేశారన్నారు. యోగాంధ్ర.ap.gov.in



పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కూడా కల్పించారన్నారు. పల్నాడు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయని అన్నారు. జూన్ 17న కోటప్పకొండలో, జూన్ 19 అమరావతిలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ యోగాంధ్ర కార్యక్రమంలో వేలాదిగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# అంబేద్కర్ కు మంత్రి అనిత ఘన నివాళి

దర్శి (ప్రకాశం) :పెన్ పవర్,జూన్ 6 దర్శి పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత , దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ .... రెండేళ్లుగా అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని అభిప్రాయపడ్డారు. దర్శి ప్రాంతంలో కూడా ఈ రెండేళ్లలో శాంతి భద్రతలు ప్రజల స్వేచ్ఛ జీవితం తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి చేస్తున్న అభివృద్ధి కృషిని ఆమె అభినందించారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి అభిమానించాలని కోరారు. త్వరలో దర్శి లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తో కలిసి పర్యటిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, మహిళలు, వివిధ హోదాల్లో ఉన్న



టిడిపి సీనియర్ నాయకులు, ఎస్సీ సోదరులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# సీఐ చిన్నమల్లయ్యకు 14 రోజుల రిమాండ్



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 6 : చిలకలూరిపేట : వినుకొండకు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన అత్యాచారం కేసులో అరెస్టైన సస్పెండ్ సీఐ చిన్నమల్లయ్యను వినుకొండ పోలీసులు శనివారం చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు.కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి నరేంద్ర రెడ్డి నిందితుడు చిన్నమల్లయ్యకు 14 రోజుల రిమాండ్ విధించారు. కోర్టు ఆదేశాల మేరకు అనంతరం పోలీసులు ఆయనను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

# చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధికార ప్రతినిధిగా తోట వెంకట పద్మావతి నియామకం



చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 6 : చిలకలూరిపేట : పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధికార ప్రతినిధిగా తోట వెంకట పద్మావతిని మాజీ మంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావుచిలకలూరిపేట నియోజకవర్గ తెలుగు మహిళా అధికార ప్రతినిధిగా తోట వెంకట పద్మావతి నియామకం నియమించినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, మహిళల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువెళ్లడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలుగు మహిళా విభాగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, కార్యదర్శి మద్దుమాల రవి, రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, యడ్లపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబా, పట్టణ ఉపాధ్యక్షుడు మురుకొండ మల్లిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ మద్దిబోయిన శివ, సీనియర్ నాయకులు తోట బ్రహ్మస్వాములు, తోట సత్యనారాయణ తదితరులు పాల్గొని నూతనంగా నియమితులైన తెలుగు మహిళా అధికార ప్రతినిధి తోట వెంకట పద్మావతికి అభినందనలు తెలిపారు.

# క్లీన్ స్వీప్' కార్యక్రమం కమిషనర్ కె.మయూర్ అశోక్




గుంటూరు, పెన్ పవర్, జూన్, 06, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, నగరాన్ని డ్రైనేజీ సమస్యలు లేని సర్వాంగ సుందర నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా రెండో వారం డ్రైన్ల శుభ్రం విజయవంతంగా జరిగిందని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత వారం రోజుల్లో నగరంలోని అన్ని డివిజన్లలో ఉన్న చిన్న మరియు మీడియం డ్రైన్లను పూర్తిగా గుర్తించి, వాటిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను తొలగించి శుభ్రం చేయడం జరిగిందని తెలిపారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడా అలసత్వం వహించకుండా పనుల వేగాన్ని పెంచేందుకు వీలుగా ప్రతి రోజు ప్రతి డివిజన్‌కు 100 మంది చొప్పున అదనపు పారిశుధ్య కార్మికులను తీసుకొని, వీరందరితో నగరంలోని అంతర్గత రహదారులు, కాలువలను సమగ్రంగా శుభ్రం చేయించడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో నగరంలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా, వరద ముప్పును నివారించేందుకు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో మేజర్ కాలువల ప్రక్షాళన చేపట్టామని, ఇందులో భాగంగా నగరవ్యాప్తంగా షుమారు 45 కిలోమీటర్ల పొడవునా ఉన్న ప్రధాన మేజర్ డ్రైన్లు, 80 కిలోమీటర్ల మీడియం డ్రైన్లలో అత్యాధునిక యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడికతీత పనులను పూర్తి చేశామన్నారు. రానున్న వర్షాలను తట్టుకునేలా నగర డ్రైనేజీ వ్యవస్థను సిద్ధం చేయడమే మొదటి ప్రాధాన్యత అని, ఇందుకోసం ఇంజినీరింగ్ మరియు పారిశుధ్య విభాగాలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ వారంలో మరింత పక్కా ప్రణాళికతో ప్రతిరోజూ ఉదయం పూట డ్రైన్ డీసిల్టింగ్, బ్యాక్ లేన్ శానిటేషన్, నాలాల పిచ్చిమొక్కల తొలగింపు, తుఫాను నీటి కాలువల క్లియరెన్స్, నిల్వ నీటి తొలగింపు మరియు యాంటీ-లార్వా వంటి దోమల నివారణ చర్యలు ముమ్మరంగా చేపట్టినట్లు వివరించారు. అలాగే మధ్యాహ్నం వేళల్లో యంత్రాల సహాయంతో ప్రధాన డ్రైన్ల పూడికతీత, అంతర్గత మరియు కాలువల శుభ్రం, డ్రైనేజీ అడ్డంకుల తొలగింపుతో పాటు వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి శుభ్రం చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులన్నింటినీ ఫోటో డాక్యుమెంటేషన్ మరియు నిరంతర నివేదికల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. నగర ప్రజలు కూడా కాలువల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని, ఈ నెల 8 నుండి 13 వరకు నివాస, వాణిజ్య, భారీ వ్యర్థాల ఉత్పత్తిదారులకు అవగాహన పై జరిగే ఆపరేషన్ క్లీన్ స్వీప్ 3వారం కార్యక్రమాల్లో కూడా విస్తృతంగా పాల్గొని, గుంటూరును స్వచ్ఛ నగరంగా మార్చే ఈ 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' లో భాగస్వాములు కావాలని కోరారు.

# రాజ్యసభ అభ్యర్థి నామినేషన్ లో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కఆనందబాబు

వేమూరు(భట్టిప్రోలు) పెన్ పవర్,జూన్, 06 రాష్ట్రంలోని కూటమి పార్టీలు బలపరిచిన జనసేన పార్టీ రాజ్యసభ అభ్యర్థి గా లింగమనేని రమేష్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు,మాజీ మంత్రి,వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మాత్యులు కొల్లు రవీంద్ర,జనసేన పార్టీ ఎం ఎల్ సి కొణిదల నాగేంద్రబాబు(నాగబాబు)తదితరులు పాల్గొన్నారు.



# సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా జంగు మహబూబ్ సుభాని నియామకం

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 6 : చిలకలూరిపేట : ప్రముఖ న్యాయవాది జంగు మహబూబ్ సుభాని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా నియామకం పొందడం పట్ల న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయవృత్తిలో విశేష అనుభవం కలిగిన జంగు మహబూబ్ సుభాని ప్రజలకు న్యాయసేవలు అందించడంలో విశేష కృషి చేశారని పలువురు పేర్కొన్నారు. ఆయన అంకితభావం, క్రమశిక్షణ, న్యాయపరమైన నైపుణ్యానికి గుర్తింపుగానే ఈ పదవి లభించిందని అభినందించారు. చిలకలూరిపేట లో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరించనున్న జంగు మహబూబ్ సుభాని ప్రజలకు మరింత సమర్థవంతంగా న్యాయసేవలు అందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సహచర న్యాయవాదులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# సూపర్వైజర్లు బి ఎల్ ఓ లు కలిసి పని చేయాలి

బాపట్ల,( పెన్ పవర్). జూన్ 06 : సూపర్వైజర్లు, బిఎల్ఓ లు సమన్వయం చేసుకొని ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ బంగ్లా నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల జాబితా సవరణ పై (సర్ ) ఆర్డీవోలు మున్సిపల్ కమిషనర్లు తాసిల్దారులు సూపర్వైజర్లు బిఎల్ ఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్వైజర్లు, బిఎల్ఓ లు సమన్వయం చేసుకొని ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగవంతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 5 నియోజకవర్గాలలో చీరాల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో చివరి స్థానంలో ఉండడానికి గల కారణాలు చెప్పాలని ఆర్డీఓ ను ఆదేశించారు. ప్రతి బిఎల్ఓ రోజుకు 15 మందిని మ్యాపింగ్ చేయాలని తెలిపారు. బి యల్ ఓ ల కు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయుటలో కొంత మంది బిఎల్ఓ లు



వెనుకబడి ఉన్నారని వారు కూడా ఎనామలిస్ ఎస్ ఐ ఆర్ తోపాటు ఎన్యుమరేషన్ కూడా చేయాలన్నారు. జిల్లాలో ఇంకా 218 మంది బి యల్ ఓ లు జీరోలో ఉన్నారుని వాటికి గల కారణాలపై ఆయన ఆర్డిఓను ఆరా తీశారు. జిల్లాలో నిన్న ఉదయం నుండి ఇప్పటివరకు 18180 చేయగా, అందులో నిజాంపట్నం 1212 ఎక్కువగా చేశారని, యుద్దనపూడి మండలం చివరలో ఉందన్నారు. కొన్ని మండలాలలో చాలామంది ఒక్కటి కూడా చేయలేదని వారిపై క్రమశిక్షణ ఆచర్యలకు ఈ ఫైల్ పెట్టాలని డీ ఆర్ ఓ ను ఆదేశించారు. కర్లపాలెం మండలం, పోలింగ్ స్టేషన్ 122 బిఎల్ఓ సుజాత 86 ఇంత మందిని ఒక రోజులో మ్యాపింగ్ చేయుట ఏ విధంగా సాధ్యమైందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వి సి లో ఆర్డీఓ లు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు,ఈ ఆర్వోలు, ఏ ఈ ఆర్ వో లు, సూపర్వైజర్లు, బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు

# నరసరావుపేట ఏరియా ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ

## సౌకర్యాలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు





నరసరావుపేట, పెన్ పవర్ జూన్ 6: నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శనివారం ఉదయం లింగంగుంట్లలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల మదర్ అండ్ చైల్డ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన 13 ఎయిర్ కండిషనర్ల పనితీరును పరిశీలించిన ఎమ్మెల్యే ప్రతి వార్డును సందర్శించి గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోగులు మాట్లాడుతూ ఏసీలు ఏర్పాటు చేసిన తర్వాత ఉక్కపోత లేకుండా ప్రశాంత వాతావరణంలో సంతోషంగా ఉన్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఇలాంటి సౌకర్యాలు ఉండటం ఆనందంగా ఉందని తెలిపారు. రోగుల వెంట వచ్చిన కుటుంబ సభ్యులు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వాష్‌రూమ్‌ల నిర్వహణ, విద్యుత్ సరఫరా, జనరేటర్, లక్ష లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. నైట్ డ్యూటీలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటాన్ని అభినందించారు. ఓపీకి రోజుకు 600 నుండి 700 మంది రోగులు వస్తున్నారని, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, హైటెక్ ల్యాబ్, బ్లడ్ బ్యాంక్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వారానికి ఒకసారి కార్డియాలజీ, న్యూరాలజీ ఓపీ సేవలను వైద్యులు స్వచ్ఛందంగా అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో సౌకర్యాలు లేవంటూ మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అవాస్తవ ప్రచారం చేస్తున్నారు. నేను స్వయంగా పరిశీలించాను. శానిటేషన్ అద్భుతంగా ఉంది, డ్రైనేజీ వ్యవస్థ సరిగా ఉంది, తాగునీటి సరఫరా బాగుంది. కొత్తగా బిగించిన ఏసీల వల్ల తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అసత్య ఆరోపణలు మానుకొని చేతనైతే ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని గోపిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదిక కు వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో డ్రైనేజీ వ్యవస్థను కూడా పరిశీలించినట్లు తెలిపారు. 24/7 రోగులకు సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, సిబ్బందికి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్, సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఒక మంచి నాయకుడు తలచుకుంటే ఏదైనా సాధ్యమని నిరూపించారు. ప్రభుత్వ ఆసుపత్రి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తోంది. ఉమ్మడి కూటమి ప్రభుత్వం ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలను తీర్చిదిద్దుతోందని పలువురు రోగులు, వారి బంధువులు ఎమ్మెల్యేను అభినందించారు.

# ప్రియుడితో కలిసి భర్తను చంపించిన భార్య అరెస్ట్

## ప్రమాదంగా చిత్రీకరించేందుకు స్కెచ్!

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 6 : చిలకలూరిపేట : ఒంగోలుకు చెందిన న్యాయవాది శ్రీరామ హరిప్రసాద్ (37) హత్య కేసులో ఆయన భార్య నాగజ్యోతి (30)ని రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ప్రియుడితో కలిసి ఆమె ఈ దారుణానికి ఒడిగట్టింది.

హత్యకు ప్లాన్ ఇలా

నాగజ్యోతికి పెళ్లికి ముందే బాపట్ల జిల్లాకు చెందిన ఉసరి వెంకట కోటయ్య (40)తో అక్రమ సంబంధం ఉంది. భర్తను వదిలించుకుంటే తామిద్దరం కలిసి ఉండవచ్చని, పైగా ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయని వీరు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా హరిప్రసాద్ పేరిట ఇన్సూరెన్స్ చేయించి, నాగజ్యోతిని నామినీగా పెట్టారు.

యాక్సిడెంట్‌గా చిత్రీకరణ

ఈ ఏడాది ఏప్రిల్ 10న కోటయ్య తన స్నేహితుడు శ్రీనివాసరావుతో కలిసి హరిప్రసాద్‌కు మద్యం తాగించాడు. అనంతరం యడవల్లి సమీపంలో ఇనుప రాడ్‌తో తలపై కొట్టి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు శవాన్ని, స్కూటీని రోడ్డు పక్కన పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.

కేసు ఛేదించిన పోలీసులు

పోలీసులు మృతదేహంపై ఉన్న గాయాలను బట్టి దీనిని మర్డర్ కేసుగా నమోదు చేశారు. ఏప్రిల్ 12నే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, లోతుగా జరిపిన



విచారణలో భార్య నాగజ్యోతి కుట్ర బయటపడింది. దీంతో ఆమెను కూడా అరెస్ట్ చేసి సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి క్లూస్ లేకపోయినా కేసును ఛేదించిన రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్.ఐ అనిల్ కుమార్‌లను పల్నాడు జిల్లా ఎస్పీ అభినందించారు.

# దుర్బుద్ధి, దుర్మార్గపు ఆలోచనతోనే డీఎస్సీపై జగన్ విషప్రచారం : ప్రత్తిపాటి

### అభివృద్ధి, సంక్షేమాన్ని స్వాగతించకుండా ఏడుపుగొట్టు రాజకీయాలు చేస్తే జగన్ కు ఉన్న ఆ 39 శాతం ఓట్లు పోతాయి.

### 250 కోర్టు కేసులు పరిష్కరించి నిరుద్యోగుల దశాబ్దాల కల లోకేశ్ నిజం చేశాడన్న అక్కసు, అసూయ జగన్ లో స్పష్టంగా కనిపిస్తోంది.

చిలకలూరిపేట , పెన్ పవర్, జూన్ 6 : చిలకలూరిపేట : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, ప్రజలకు చేస్తున్న మంచిని ఓర్వలేకే జగన్, ముగిసిపోయిన అంశాలపైనా కుట్ర రాజకీయాలు చేస్తున్నాడని, డీఎస్సీ జరగకూడదన్న దురుద్దేశంతో 250 వరకు తప్పుడు కేసులు కోర్టులో వేయించిన జగన్, నేడు డీఎస్సీపై సీబీఐ విచారణ కోరడం సిగ్గుచేటని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్ని వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

దగా డీఎస్సీ, ఉత్తుత్తి జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగుల్ని మోసగించిన జగన్...నేడు యువతను రెచ్చగొట్టడానికే డీఎస్సీని తప్పుపడుతున్నాడు

ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగాడీఎస్సీ నిర్వహణలో లోకేశ్ కృషి, సమర్థత ఎంతో ఉందన్న ప్రత్తిపాటి, జగన్ వేయించిన తప్పుడు కేసుల్ని పరిష్కరించి, 16,347 పోస్టుల్ని భర్తీ చేసి, చరిత్ర సృష్టించారన్నారు. ఎన్నడూ లేనివిధంగా ప్రజల సమక్షంలో ఉద్యోగార్థులకు నియామక పత్రాలు అందించారన్నారు. తాను అమలు కాకుండా చేద్దామనుకున్న డీఎస్సీని లోకేశ్ సాకారం చేశాడన్న అక్కసు, అసూయతోనే జగన్ ఇప్పుడు విషప్రచారం చేస్తున్నాడన్నారు. ఐదేళ్లు యువతను మోసగించి, దగా డీఎస్సీ, ఉత్తుత్తి జాబ్ క్యాలెండర్ తో వంచించిన జగన్, లోకేశ్ సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమిప్రభుత్వానికి పేరు రాకూడదనే జగన్ డీఎస్సీని అడ్డుకున్నాడన్నారు. దొంగలు పడ్డ ఆర్నెల్ల సామెత తీరుగా వైసీపీ తీరుందని, ఎప్పుడో పూర్తైన డీఎస్సీపై ఇప్పుడు కోర్టులను ఆశ్రయించడం. గవర్నర్ కు ఫిర్యాదుచేయడం ఏంటని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఉద్యోగాలు రాని వారికి బాధ ఉండటం సహజమని, అలాంటి ఒకరిద్దరితో జగన్ కుట్ర రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఉద్యోగాలు పొందిన వారి సంతోషం, వారి జీవితాలు, కుటుంబాల కంటే జగన్ కు తన స్వార్థ రాజకీయాలే ముఖ్యమైపోయా యన్నారు.

తన అవినీతి కేసులు విచారణపై మాట్లాడే ధైర్యం లేదుగానీ.. డీఎస్సీపై సీబీఐ విచారణ కావాలా?

పుష్కరకాలం దాటిన తన అవినీతికేసుల విచారణ, పురోగతిపై సీబీఐతో మాట్లాడే ధైర్యం లేని జగన్.. డీఎస్సీపై సీబీఐ విచారణ కోరడం విడ్డూరంగా ఉందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. తనపై ఉన్న కేసుల నుంచి బయటపడి ప్రజల ముందుకొచ్చి జగన్ ఏమైనా మాట్లాడినా అర్థం ఉంటుందన్నారు. సీబీఐ తేల్చిన రూ.47 వేల



కోట్ల అక్రమార్జన సొమ్ములో రూపాయి ప్రజలకు పంచని జగన్.. అవినీతి కళ్లతో కూటమి ప్రభుత్వ పాలనను నిందిస్తున్నాడన్నారు. రాజధాని రైతుల్ని రెచ్చగొట్టేందుకు కమిటీలు.. డీఎస్సీపై కమిటీలు కేవలం జగన్ విధ్వంస రాజకీయాల్లో భాగమేనని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. అమరావతి పూర్తవడాన్ని జగన్ కలలో కూడా సహించలేడన్నారు. జగన్ తన పద్ధతి. ఆలోచనా విధానం మార్చుకోకుంటే గత ఎన్నికల్లో పడిన 39 శాతం ఓట్లు కూడా ఈసారి పడవని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. జగన్ విషప్రచారాన్ని ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు.

అభివృద్ధి, పాలనా విజయాలు ప్రజలకు తెలియచేసేందుకే బహిరంగ సభలు

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో జరిగిన అద్భుతమైన అభివృద్ధి, ప్రజలకు అందుతోన్న సంక్షేమం, ఇతర విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే భారీ బహిరంగసభలు నిర్వహిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖపట్నంలో 9, 12, 17న జరిగే భారీ బహిరంగ సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దారును సత్కరించిన ఎంపీపీ



భట్టిప్రోలు, పెన్ పవర్ (జూన్, 06:) భట్టిప్రోలు మండలానికి నూతనం గా విచ్చేసిన తహసిల్దారు జి నాగరాజు ను మర్యాద పూర్వకముగా భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలితా మల్లేశ్వర రావు శనివారం రెవెన్యూ కార్యాలయంలో కలసి అభినందనలు తెలిపారు. తహసిల్దారును ఎంపీపీ దంపతులు శాలువా కప్పి,బొకే అందించి అభినందించారు.

# కావలి తాసిల్దార్ గా శ్రావణ్ కుమార్ గౌడ్ సామాజిక వర్గం అభినందనలు




కావలి పెన్ పవర్,జూన్ 6 కావలిలో డిప్యూటీ తాసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్ కుమార్ ప్రభుత్వ ఆదేశాల మేరకు పదోన్నతి పై తాసిల్దార్ గా కావలిలోనే బాధ్యతలు శనివారం తీసుకున్నారు. ఈ మేరకు గౌడ సామాజిక వర్గం నేతలు, పలు రాజకీయ పార్టీల నేతలు అభిమానులు అభినందనలు తాసిల్దార్ కి తెలియజేశారుకోసూరు లక్ష్మి ప్రత్యుష తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, కోసూరు వెంకటేశ్వర్లు గౌడ్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు, నాసిన జాలరావు గౌడ్, నాసిన ప్రసాద్ గౌడ్, ఉప్పాల దినేష్ గౌడ్, ఉప్పాల శ్రీనివాసులు గౌడ్, గుడిపల్లి వెంకయ్య గౌడ్, తాత హరిబాబు గౌడ్, ఆళ్లపాక రవి గౌడ్, పోసిన శ్రీనివాసులు



గౌడ్, ఉప్పాల కిరణ్ గౌడ్, మోర్ల తిరుపతి స్వామి గౌడ్, నాగేశ్వరరావు గౌడ్....

# అమ్మో.. చిరుత పులి..!



పీలేరు (అన్నమయ్య) : పెన్ పవర్,జూన్ 6పీలేరు మండలంలోని రేగళ్ళు, బాలంవారిపల్లి పంచాయతీల పరిధిలో చిరుత పులి సంచరిస్తున్నట్లు వచ్చిన సమాచారం స్థానికంగా కలకలం రేపింది. శనివారం ఉదయం ఉపాధి హామీ పనుల కోసం గ్రామ శివారు ప్రాంతానికి వెళ్లిన ఓ కూలీ, పొదల మధ్య చిరుతను పోలిన జంతువు సంచరిస్తున్నట్లు గమనించినట్టు గ్రామస్తులకు తెలిపాడు. ఆ కూలీ తెలిపిన వివరాలు గ్రామంలో వేగంగా వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. అయితే ఆ జంతువును చూసిన కొద్ది సేపటికే అది అడవివైపు వెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పరస్పరం హెచ్చరికలు చేసుకుంటున్నారు. ఇదే విషయాన్ని కొందరు గ్రామస్తులు అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. చిరుత సంచారంపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉన్నప్పటికీ, ఈ వార్త గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది గ్రామ శివారు ప్రాంతాల్లో వ్యవసాయ పనులు, ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు, రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు ఘటనపై దృష్టి సారించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఎపి కి చల్లటి కబురు ..!

అమరావతి : పెన్ పవర్,జూన్ 6 గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ అత్యంత చల్లటి కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాయి. రాష్ట్రంలోని అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలను రుతుపవనాలు తాకినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా వెల్లడించింది. రాబోయే రోజుల్లో రుతుపవనాలు వేగంగా ముందుకు కదలనున్నాయి. ఈ నెల 10వ తేదీ నాటికి ఎపిలోని సగానికి పైగా భూభాగానికి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తొలకరి జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికే కేరళలోకి ప్రవేశించాల్సిన నైరుతి రుతుపవనాలు, ఈసారి మూడు రోజులు ఆలస్యంగా గురువారం కేరళను తాకాయి. అయినప్పటికీ, ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాగే రుతుపవనాల సీజన్‌లో దేశంలో 90 శాతం మేర సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి స్పష్టం చేసింది. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ.. ఉక్కపోత, ఎండల తీవ్రత వెంటనే తగ్గే పరిస్థితి లేదని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో వేడిగాలుల ప్రభావం మరికొద్ది రోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పెమ్మసాని ఔట్...

**గుంటూరు, జూన్ 6,పెన్ పవర్ :**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో మంత్రి నారాయణ మాత్రమే అంతా చూసుకుంటారు. ఆయన పర్యవేక్షణలోనే పనులు జరగాలి. మంత్రి నారాయణ కూడా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాత్రం ఇక్కడ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. పెమ్మసాని తప్పుకున్నారా?. తప్పించారా? అన్న చర్చ టీడీపీ వర్గాల్లోనే జరుగుతుంది. అమరావతి రాజధాని లో రైతుల నుంచి భూమిని సేకరించాలంటే కేంద్ర మంత్రి పెమ్మసాని వచ్చి రైతులకు కొంత నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయితే నారాయణ మాత్రం పెమ్మసాని జోక్యాన్ని పెద్దగా ఇష్టపడటం లేదని తెలిసింది. ఈ విషయాన్ని గ్రహించిన నాయకత్వం పెమ్మసానికి ఏవైనా పరోక్షంగా ఆదేశాలిచ్చిందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. 2014లోనూ మంత్రి నారాయణ అంతా తానే అయి అమరావతి పనులను చూశారు. నాడు రాష్ట్రమంత్రి పత్తిపాటి పుల్లారావు కూడా తోడుగా ఉన్నారు. మరొక విషయం ఏంటంటే...మంత్రి నారాయణపై చంద్రబాబు, లోకేశ్ పై అపార నమ్మకం ఉంది. ఆయన తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా పూర్తి చేస్తారన్న విశ్వాసం ఉంది. మంత్రి నారాయణకు, చంద్రబాబు కుటుంబానికి సంబంధం ఈనాటిది కాదు. కొన్ని దశాబ్దాలుగా వారి మధ్య నమ్మకమైన మైత్రి నడుస్తుంది. అయితే అమరావతి రాజధాని నిర్మాణంలో మరొకరు క్రెడిట్ కొట్టేయడానికి మంత్రి నారాయణ ఇష్టపడటం లేదని తెలిసింది. మంచైనా, చెడైనా తానే చూసుకుంటానన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

చంద్రబాబు, లోకేశ్ లు కూడా రాజధాని అమరావతి పనుల విషయంలో మంత్రి నారాయణకే పూర్తి బాధ్యతలను అప్పగించారు. అలాగే ఏ విషయం ఉన్నా నారాయణతోనే చర్చిస్తున్నారు. అందుకే అమరావతి రాజధాని పనుల పర్యవేక్షణ, భాధ్యతలనుండి నుంచి, కేంద‌మంత్రి పెమ్మసాని తెలివిగా తప్పుకున్నారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అధికారులు కూడా మంత్రి నారాయణ మాటకు మాత్రమే విలువ ఇస్తుండటంతో ఇక తన అవసరం ఇక్కడ లేదని పెమ్మసాని చంద్రశేఖర్ తనంతట తానుగానే అమరావతి పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పుకున్నారన్న చర్చ టీడీపీ వర్గాల్లోనూ నడుస్తుంది. అందుకే అమరావతి రాజధాని ప్రాంతాలలో కేంద్ర మంత్రి పెమ్మసాని హడావుడి పూర్తిగా కన్పించడం మాయమైందంటున్నారు. మరి ఇందులో నిజానిజాలు మాత్రం తెలియదు. ప్రచారం మాత్రం ఇలాగే జరుగుతుంది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


## 30 కిలోల బరువు తగ్గిన లోకేశ్

**గుంటూరు జూన్ 6, పెన్ పవర్ :** తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, హెచ్ఆర్డీ మంత్రి నారా లోకేశ్ లుక్‌లో ఊహించని మార్పు కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా చేపట్టిన 'యువగళం' పాదయాత్రకు ముందు నుంచే బాడీ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన లోకేశ్, ఈ మధ్య మరీ స్లిమ్‌గా మారిపోయారని అంటున్నారు. అంతేకాదు మునుపటి కంటే చాలా యాక్టివ్‌గా కనిపిస్తున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. ఒకప్పుడు చాలా బొద్దుగా ఉండే లోకేశ్ ఏకంగా 30 కిలోల బరువు తగ్గారు. దీనికోసం ఆయన సెపరేట్ డైట్ ప్లాన్ చేసుకున్నారు. తన వెయిట్ లాస్ సీక్రెట్ ను యువనేత తాజాగా బయటపెట్టారు. దీంతో జంక్ ఫుడ్, ఊబకాయం సమస్యలతో సతమతమవుతున్న యువతీయువకులు లోకేశ్ డైట్ సీక్రెట్ గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నారు. లోకేశ్ కామెంట్స్ వైరల్ సాధారణంగా బరువు తగ్గాలనుకునే వారు అన్నం పరిమాణాన్ని తగ్గిస్తారు. కానీ లోకేశ్ ఏకంగా రైస్‌కు పూర్తిగా దూరమయ్యారు. తాజాగా తన డైట్ ప్లాన్‌పై స్పందించిన లోకేశ్.. "నేనసలు రైస్ తినను, జీరో రైస్" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే అన్నం తన ఆహార జాబితా నుంచి పూర్తిగా తొలగించడమే తన తాజా వెయిట్ లాస్ వెనుక ఉన్న ముఖ్య కారణమని ఆయన స్పష్టం చేశారు. అధిక బరువు సమస్యను ఎప్పుడో అధిగమించినప్పటికీ, ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలనే ఆలోచనతోనే ఆయన ఈ సరికొత్త 'జీరో రైస్' డైట్‌ను ఫాలో అవుతున్నట్లు చెబుతున్నారు. లోకేశ్ తన బరువును, ఫిట్‌నెస్‌ను అదుపులో ఉంచుకోవడానికి కొన్నాళ్లుగా 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్' అనే ప్రసిద్ధ పద్ధతిని అనుసరిస్తున్నారు. తన బిజీ షెడ్యూల్‌ను బట్టి ఆయన రోజులో 16:8 లేదా 18:6 ఫాస్టింగ్ పద్ధతులను పాటిస్తున్నారని చెబుతున్నారు. అంటే రోజులో 16 నుంచి 18 గంటల పాటు ఏమీ తినకుండా కఠినమైన ఉపవాసం ఉంటూ, మిగిలిన 6 నుంచి 8 గంటల వ్యవధిలో మాత్రమే ఆహారం తీసుకుంటారు. ఇందులో భాగంగానే ఆయన 'వన్ మీల్ ఏ డే' విధానాన్ని ఎంచుకున్నట్లు చెబుతున్నారు. రోజుకు కేవలం ఒక్క పూట మాత్రమే ఆహారం తీసుకుంటూ తన బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ను సమతుల్యంగా ఉంచుకుంటున్నారు. అయితే, ఆ ఒక్క పూట తినే భోజనంలో రైస్ లేకుండా చూసుకుంటూ.. శరీరానికి కావలసిన ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండేలా పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఇక లోకేశ్ డైట్ ప్లాన్ పై నిపుణులు కూడా పాజిటివ్ గానే స్పందిస్తున్నారు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, జీరో రైస్ డైట్ వల్ల శరీరంలో మెటబాలిజం అద్భుతంగా మెరుగుపడుతుందని, బరువు తగ్గడానికి ఇది అత్యంత వేగవంతమైన, సురక్షితమైన మార్గమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, రోజుకు ఒక్క పూటే భోజనం చేసేటప్పుడు ఆ ఆహారంలో శరీరానికి కావలసిన అన్ని రకాల పోషకాలు, ఖనిజాలు ఉండేలా చూసుకోవాలని, లేదంటే నీరసం లేదా పోషకాహార లోపం వచ్చే ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు.లోకేశ్ 'జీరో రైస్' ఫిట్‌నెస్.. ఎన్ని కిలోలు తగ్గారంటే..? తన వెయిట్ లాస్ సీక్రెట్ ను యువనేత తాజాగా బయటపెట్టారు. దీంతో జంక్ ఫుడ్, ఊబకాయం సమస్యలతో సతమతమవుతున్న యువతీయువకులు లోకేశ్ డైట్ సీక్రెట్ గురించి విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

## లైన్ లో పెద్దిరెడ్డి ఉన్నారా...

**తిరుపతి, జూన్ 6, పెన్ పవర్ :** వైసీపీ నాయకులు.. చాలా మందిపై కూటమి ప్రభుత్వం వచ్చాక కేసులు నమోదైన విషయం తెలిసిందే. మద్యం కుంభకోణంలో 3500 కోట్ల రూపాయల మేరకు బొక్కేశారన్న కేసు ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. జగన్ అప్పటి పీఎ.. కె, నాగేశ్వరరావుపై ప్రస్తుతం దృష్టిపెట్టారు. ఇక, అప్పట్లోనే జరిగిన మరిన్ని వివాదాలు.. హత్యలు.. శవం డోర్ డెలివరీ కేసులు.. నాయకులను వెంటాడుతున్నాయి. ఈ పరంపరలో ఇప్పుడు.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంతు వచ్చింది వైసీపీ హయాంలో పంచాయతీ, అటవీశాఖ మంత్రిగా పెద్దిరెడ్డి వ్యవహరించారు. ఆ సమయంలో కేంద్ర నిధులతో పంచాయతీల్లో రహదారులువేసే పనులు చేపట్టారు. ఇవి రాష్ట్ర వ్యాప్తంగాసాగాయి. ఆయా జిల్లాలో వైసీపీకి చెందిన వారు కాంట్రాక్టులు దక్కించుకున్నారన్నది తెలిసిందే. అయితే.. ఇప్పుడు కేంద్రం నుంచి పనుల నాణ్యతపై సందేహాలు వచ్చాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో రహదారులు పాడయ్యాయని.. ప్రస్తుతం పంచాయతీ రాజ్ అధికారులు కేంద్రానికి లేఖలుపంపారు.అయితే... తాము నిధులు ఇచ్చి, ఆయా పనులు చేపట్టి .. కేవలం నాలు గేళ్లు కూడా కాకుండానే ఎందుకు పాడయ్యాయని.. వీటిపై విచారణ చేయాలని కేంద్రం నుంచి రాష్ట్రానికి తాఖీదు అందింది. దీంతో పెద్దిరెడ్డి జమానాలో చేపట్టిన రహదారుల నిర్మాణం. ముఖ్యంగా ఆయన సొంత నిర్మాణ సంస్థ పీఎల్ఆర్ దక్కించుకున్న కాంట్రాక్టులు.. చేపట్టిన పనులు వంటివాటిపై విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టారు. ఈ మొత్తం వ్యవహారంలో 500 కోట్లరూపాయల మేరకు.. నిధులు సొంతం చేసుకున్నారన్న ఆరోపణలు వున్నాయి అప్పట్లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాలపై ఎన్నో ఊహాగానాలు చెలరేగగా, దాదాపు నాలుగేళ్ల తర్వాత లలిత్ మోదీ తమ బ్రేకప్ వెనుక ఉన్న అసలు నిజాన్ని బహిరంగంగా వెల్లడించారు. తన సొంత జిల్లా చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి సంస్థ చేపట్టిన పనులు నాసిరకంగా ఉండడం.. ఇక్కడి రహదారులు రెండేళ్లకే ధ్వంసం కావడంతో ఆయా పనులపై విచారణ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. దీనిలో అవకతవకలు భారీగానే జరిగాయని విజిలెన్స్ అదికారులు భావిస్తున్నారు. దీనికితోడు కాంట్రాక్టర్ల ను కూడా బెదిరించి.. పీఎల్ ఆర్ సంస్థకే అన్ని పనులు కట్టబెట్టారన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్దిరెడ్డిపై చర్యలు ఖాయమని.. నిజాలు నిగ్గుతేలుతాయని చిత్తూరు రాజకీయ వర్గాలు అంటున్నాయి. కాగా.. గత ఏడాది అటవీ భూములు ఆక్రమించుకున్నారని.. పవన్ కల్యాణ్ విమర్శలు చేసినప్పటికీ.. వాటిపైచర్యలు ఏమయ్యాయో.. ఇప్పటికీ అంతుచిక్కడం లేదు.


## మద్యం కేసులో జగన్ కు నోటీసులు

**చిత్తూరు, జూన్ 6,పెన్ పవర్ :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలోనే సంచలనం చోటు చేసుకోనంది. మద్య కుంభకోణం దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు నోటీసులు ఇవ్వబోతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లు గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన వారి చుట్టూ తిరిగిన దర్యాప్తు ఇప్పుడు అంతి లబ్ధిదారులను గుర్తించే దిశగా సాగుతోందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించిన అధికారులు ఇప్పుడు జగన్ పాత్రపై విచారించేందుకు రెడీ అయ్యారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ అభియోగాలు ఆధారంగా ఈడీ అధికారులు కూడా వందల మందిని విచారించారు. బండిళ్ల కొద్ది సమాచారాన్ని సేకరించారు. వాటి ఆధారంగా కేసు దర్యాప్తును ముగించాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకే ఇప్పటి వరకు లభించిన సాక్ష్యాలు, ఆధారాలను బట్టి కీలక వ్యక్తులను విచారిస్తారని తెలుస్తోంది. అందులో భాగంగానే త్వరలోనే జగన్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలుస్తారని అధికార వర్గాల్లో చర్చ నడుస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చింది. రేట్లు పెంచి మద్యం వినియోగం తగ్గిస్తామని చెప్పిన వైఎస్ జగన్ కొత్త పాలసీతో ఆ పని చేస్తామన్నారు. అయితే ఇష్టం వచ్చినట్టు రేట్లు పెంచారు. ఇలా పెంచడం వెనుక వ్యక్తిగత లబ్ధి ఉందని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తూ వచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దర్యాప్తునకు ఆదేశించింది. ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసింది.అధికారంలోకి వచ్చిన మొదట్లో వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఇష్టం వచ్చినట్టు రేట్లు పెంచారు. దీని వల్ల మద్యం విక్రయాలు భారీగా పడిపోయాయి. ప్రభుత్వ ఆదాయం కూడా తగ్గిపోయింది. అయితే మళ్లీ మద్యంపై ధరలు తగ్గించారు. దీంతో ఒక్కసారిగా విక్రయాలు పెరిగాయి. ఇలా చేయడంలో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయనే ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి. ఇలా భారీగా విక్రయాలు పెంచుకునే క్రమంలో లంచాలు ఇచ్చిన బ్రాండ్స్‌ను మాత్రమే ప్రమోట్ చేశారని, మిగతా బ్రాండ్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచలేదని ప్రధాన ఆరోపణ. ఇలా చేయడం వల్ల బ్రాండ్ల బేస్ ప్రైస్‌ను బట్టి ఒక్కో బాటిల్‌పై 150 నుంచి 600 రూపాయలు వసూలు చేసినట్టు వచ్చిన ఆరోపణలపై ఇప్పుడు దర్యాప్తు సాగుతోంది. దీనికి తోడు మద్యం దుకాణాల్లో కేవలం డిజిటల్ పేమెంట్స్‌ను అనుమతి ఇవ్వకపోవడంపై కూడా అనుమానాలు ఉన్నాయి. అందుకే కూటమి వచ్చిన వెంటనే ఈ వ్యవహారంపై సమగ్రమైన దర్యాప్తుకు ఆదేశించింది. ఈ దర్యాప్తులో రాజ్‌కసిరెడ్డి కీలకంగా వ్యవహరించినట్టు తేలింది. అతన్ని అరెస్టు చేసి విచారిస్తున్న అధికారులు, సప్లై చెయిన్‌ను పట్టుకున్నట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంపై సిట్ ఇప్పటికే అభియోగపత్రం దాఖలు చేసింది. అందులో సంచలన విషయాలు వెల్లడించింది.
ఇప్పటి వరకు విచారణ ఎదుర్కొన్న వ్యక్తులు

# రెండు ప్రభుత్వాల్లో తేడా లేదు...

**నెల్లూరు, జూన్ 6, పెన్ పవర్ :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే ఒకప్పుడు ఎమ్మెల్యేలు భయపడే వారు. ఆయన నిత్యం డేగకళ్లతో వారి పనితీరును గమనించే వారని ఒకింత కంట్రోల్ లో ఉండేవారు. కానీ 2024 ఎన్నికల్లో కొత్తవారు ఎన్నికయిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. చంద్రబాబు ఎదుట ఒకింత భయం నటిస్తున్నా నియోజకవర్గాల్లో వారు చేయాల్సింది చేస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన వార్నింగ్ లను అసలు లెక్క చేయడం లేదు. తమ పని తాము చేసుకుబోతున్నారు. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ గత ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బును సంపాదించుకోవడం కోసమే ఎక్కువ దృష్టి పెట్టారు. ఇది పార్టీని నియోజకవర్గాల్లో డ్యామేజీ చేస్తుంది.జనంలోనూ గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి పెద్దగా తేడా ఏం లేదన్న భావన ప్రజల్లో కలుగుతుంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులనే ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా చేస్తుంది. అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు ఇవేమీ ఓట్లు సంపాదించి పెట్టే అవకాశాలు లేవని గుర్తించకపోవడమే అధికార పార్టీ చేస్తున్న తప్పిదం. గత ఎన్నికల్లో 164 స్థానాలు రావడంతో ఇక తమకు తిరుగులేదన్న ధీమాలో ఉన్నారు. కానీ పెరుగుతున్న ధరలు, లంచాలు, అవినీతి, అరాచకాలు ఈ ప్రభుత్వంలో కూడా ప్రజలకు స్పష్టంగా కనపడుతున్నాయి. దీంతో దెందూ దొందే అని ప్రజలు డిసైడ్ అయినట్లు కనిపిస్తుంది. రానున్న కాలంలో ఇది కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందులుగా మారే అవకాశముందన్న విశ్లేషణలు కూడా వెలువడుతున్నాయి.వీళ్లకీ వాళ్లకీ పెద్దగా తేడా లేనప్పుడు ఎవరు వస్తే ఏం అన్న భావనలో ప్రజలు ఉన్నట్లు కనపడుతుంది. అమరావతినే తీసుకుంటే ఎన్నికలకు



ముందు చెప్పింది వేరు. ఇప్పుడు జరుగుతుంది వేరు. గతంలో ఒకసారి ల్యాండ్ పూలింగ్ కు స్వచ్ఛందంగా రైతులు అమరావతికి భూములు ఇచ్చారు. కానీ ఇక ప్రతి పనికీ వరసగా భూ సేకరణ చేయాలని నిర్ణయించడం నియంతృత్వంగా ఆ ప్రాంత రైతులు కూడా భావిస్తున్నారు. ఫీజు రీఎంబర్స్ మెంట్ అందడం లేదు. ఆరోగ్య శ్రీసేవలు సక్రమంగా చేరడం లేదు. ప్రభుత్వ సేవల విషయంలోనూ పెద్దగా మార్పులేదు. దీంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలకు రెండేళ్లలోనే భ్రమలు తొలిగిపోయాయని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో కొంత వాస్తవముంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల లో కూడా అలజడి, వ్యతిరేకత మొదలైంది. చాపకింద నీరులా వ్యతిరేకత మొదలయిందన్న విశ్లేషణలు మాత్రం వెలువడుతున్నాయి. సో... కూటమి సర్కార్ పారాహుషార్.

# జగన్ కోసం షర్మిళ కు హ్యాండ్...



**విజయవాడ, జూన్ 6, (పెన్ పవర్ :**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ షర్మిల చుట్టూ తిరుగుతున్న రాజ్యసభ సీటు వ్యవహారం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తాజా రాజ్యసభ అభ్యర్థుల అధికారిక జాబితాలో ఆమె పేరు లేకపోవడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన సమయం నుండి, ఆమెను కర్ణాటక లేదా ఇతర రాష్ట్రాల నుండి పెద్దల సభకు పంపుతారనే బలమైన ప్రచారం సాగింది. సాక్షాత్తూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం నడిచినప్పటికీ, చివరి నిమిషంలో ఆమెకు మొండిచేయి ఎదురుకావడం వెనుక ఢిల్లీ వేదికగా భారీ హైడ్రామా నడిచినట్లు రాజకీయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యూహం వల్లనే షర్మిలకు రాజ్యసభ దక్కలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. షర్మిలకు రాజ్యసభ సీటు దక్కితే పార్లమెంట్ వేదికగా ఆమె వాయిస్ మరింత బలంగా వినబడుతుంది. అదే సమయంలో రాష్ట్రంలో మరింత దూకుడుగా ఆమె పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హోదా లభిస్తుంది. అది ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి దారితీస్తుంది.ఇది అంతిమంగా జగన్ కు నష్టం జరుగుతుంది. ఎందుంటే వైసీపీ ఓటు బ్యాంక్ అంతా.. కాంగ్రెస్ ఓటు బ్యాంకే. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలు మొదటి నుంచి కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా ఉండేవారు. జగన్ పార్టీ పెట్టుకున్నాక ఆయన వెంట వెళ్లారు. గత ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల వల్లే వైసీపీ అభ్యర్థులు ఓడిపోయారు. ఈ ప్రమాదం గమనించిన జగన్ .. కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు వేయకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మొదట్లో ఇండీ కూటమి సపోర్టులో ఢిల్లీలో ధర్నా నిర్వహించారు. ఇటీవల ౸×= సహా ఇతర అంశాల్లో కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌కు ఇస్తున్న సిగ్నల్స్ కారణంగానే షర్మిలకు రాజ్యసభ సీటు చివరి క్షణంలో మిస్ అయినట్లుగా రాజకీయవర్గాలుచెబుతున్నాయి. రాబోయే రోజుల్లో జాతీయ స్థాయిలో ఎన్డీయే కూటమిని గద్దె దించేందుకు లేదా బిల్లుల విషయంలో అవసరమైనప్పుడు తాము ఇండియా కూటమికి మద్దతు ఇస్తామనే బలమైన సంకేతాలు పంపినట్లు ఢిల్లీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవలి కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై జగన్ చేసిన కొన్ని పరోక్ష వ్యాఖ్యలు, పార్లమెంట్‌లో గతంలో లాగా కాకుండా కొన్ని బిల్లుల విషయంలో తీసుకున్న తటస్థ వైఖరి.. కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ఆయన ఇచ్చిన శాంపిల్స్ అనే చర్చ నడుస్తోంది.

షర్మిల వల్ల ఏపీలో కాంగ్రెస్‌కు వచ్చే తాత్కాలిక మైలేజ్ కంటే, జగన్ మోహన్ రెడ్డి ద్వారా జాతీయ స్థాయిలో లభించే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువని కాంగ్రెస్ అధిష్టానం లెక్కలు వేసుకున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ కేంద్రంలో అధికారం సాధించాలంటే దక్షిణాది సీట్లే కీలకం. ఉత్తరాదిలో ఆ పార్టీ తేలిపోతోంది. దక్షిణాదిలో ఇప్పటికి ఏపీ మినహా అన్నింటిలోనూ కాంగ్రెస్ లేదా మిత్రపక్షాల ప్రభుత్వాలు ఉన్నాయి. ఈ పొలిటికల్ ఈక్వేషన్స్ వల్లే కాంగ్రెస్ హైకమాండ్ షర్మిల సీటు విషయంలో వెనక్కి తగ్గిందని, ఫలితంగా ఆమెకు దక్కాల్సిన పదవి చివరి నిమిషంలో చేజారిందని భావిస్తున్నారు. వైఎస్ కుటుంబంలో మొదలైన ఆస్తి వివాదాలు, ఆరోపణలు ఇప్పుడు ఢిల్లీ పీఠాన్ని కూడా కదిలిస్తున్నాయి. తల్లి విజయమ్మతో ఆస్తి వివాదాలు, కోర్టు కేసులతో ఇబ్బందులు పడ్డ జగన్, ఈ రాజ్యసభ సీటును అడ్డుకోవడం ద్వారా చెల్లి షర్మిలకు గట్టి షాక్ ఇచ్చారని అనుకోవచ్చు. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఏపీ కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత కలహాలకు దారితీస్తాయో, షర్మిల తన తదుపరి వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో వేచి చూడాలి.

## కేఎల్ రాహుల్ ఆస్కార్ లెవల్ యాక్టింగ్.. DRS తీసుకోకుండా మోసపోయిన ఆఫ్ఘన్ టీమ్



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ పీసీఏ స్టేడియంలో ఇండియా వర్సెస్ ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఒక ఇంట్రెస్టింగ్ ఘటన చోటు చేసుకుంది. టీమిండియా స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ గ్రౌండ్‌లో చూపించిన ఆస్కార్ లెవల్ యాక్టింగ్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఆయన చేసిన చిన్న ట్రిక్‌కు ఆఫ్ఘనిస్తాన్ జట్టు సీదా బురిడీ కొట్టి పెద్ద దెబ్బ తిన్నది.

భారత్ ఫస్ట్ ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేస్తున్న టైమ్‌లో.. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్ వేసిన ఒక బాల్ కేఎల్ రాహుల్ బ్యాట్‌కు తగులుకుంటూ వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్ళింది. బాల్ బ్యాట్‌కు తాకిన (జుఎస్ట్రవ) శబ్దం రావడంతో ఆఫ్ఘన్ ఫీల్డర్లంతా అవుట్ అంటూ గట్టిగనే అరిచారు. రివ్యూ (DRS) తీసుకుందామా వద్దా అని ఆఫ్ఘన్ కెప్టెన్, వికెట్ కీపర్ ఆలోచిస్తున్న టైమ్‌లో.. కేఎల్ రాహుల్ ఏమాత్రం టెన్షన్ పడకుండా, మస్తు కూల్‌గా నా బ్యాట్‌కు అస్సలు తాకలేదు అన్నట్టు తల అడ్డంగా ఊపాడు. కేఎల్ రాహుల్ ఇచ్చిన ఆ కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్ చూసి.. ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ నిజంగానే బ్యాట్‌కు తగల్లేదు కావొచ్చు అని నమ్మి రివ్యూ తీసుకోకుండా డ్రాప్ అయ్యాడు.

**రీప్లే చూస్తే మైండ్ బ్లాక్:**

కట్ చేస్తే.. ఆ తర్వాత టీవీ స్క్రీన్ పైన రీప్లే వేసి చూపిస్తే ఆఫ్ఘనిస్తాన్ ప్లేయర్ల మైండ్ బ్లాక్ అయిపోయింది. ఎందుకంటే బాల్ పక్కాగా కేఎల్ రాహుల్ బ్యాట్ ఎడ్జ్‌ను తాకుతూనే వెళ్ళింది. ఒకవేళ ఆఫ్ఘన్ గనుక రివ్యూ తీసుకుంటే రాహుల్ అవుట్ అయ్యి పెవిలియన్‌కు చేరేవాడు. కానీ మనోడి ఆస్కార్ లెవెల్ యాక్టింగ్‌ను నమ్మి ఆఫ్ఘన్ టీమ్ ఒక గోల్డెన్ ఛాన్స్‌ను మిస్ చేసుకుంది.

**రాహుల్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చన్న మాజీ క్రికెటర్:**

ఈ సీన్ చూసి కామెంట్రీ బాక్స్‌లో ఉన్న మాజీ ఇంగ్లాండ్ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ఫుల్ ఫిదా అయ్యాడు. ప్రెజర్ టైమ్‌లో కేఎల్ రాహుల్ మెయింటైన్ చేసిన కూల్‌నెస్‌ను మెచ్చుకుంటూ.. రాహుల్ చేసిన యాక్టింగ్‌కు ఆయనకు ఖచ్చితంగా ఒక ఆస్కార్ అవార్డ్ ఇవ్వచ్చు.. పాపం ఆఫ్ఘన్ ప్లేయర్లు ఆయన్ను గుడ్డిగా నమ్మి మోసపోయారు అంటూ నవ్వుకున్నాడు. ఆధునిక క్రికెట్‌లో డీఆర్ఎస్ (DRS) ఎంత ఇంపార్టెంటో.. ప్లేయర్ల బాడీ లాంగ్వేజ్, స్ప్లిట్ సెకండ్ డెసిషన్స్ మ్యాచ్‌ను ఎలా మారుస్తాయో చెప్పడానికి ఈ ఇన్సిడెంట్ ఒక పక్కా ఎగ్జాంపుల్ అని క్రికెట్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు.

## ఆఫ్ఘన్‌తో టెస్ట్: సెంచరీలతో కదం తొక్కిన గిల్, రాహుల్.. తొలి రోజు భారత్ ఆధిపత్యం

- భారత్-ఆఫ్ఘనిస్థాన్ ఏకైక టెస్టు
- టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా
- మొదటి రోజు ఆట చివరికి టీమిండియా తొలి ఇన్నింగ్స్ స్కోరు 368/3
- కేఎల్ రాహుల్ 100 అవుట్... సెంచరీ చేసి క్రీజులో ఉన్న గిల్
- అర్ధసెంచరీతో ఆకట్టుకున్న పంత్
- వికెట్ల కోసం చెమటోడ్చిన ఆఫ్ఘన్ బౌలర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా తొలి రోజు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103 నాటౌట్), సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (100) అద్భుతమైన సెంచరీలతో కదం తొక్కగా, యువ ఆటగాడు సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధశతకాలతో రాణించారు. దీంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్ లో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 368 పరుగుల భారీ స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మొహాలీలోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. సుదీర్ఘమైన టీ20 సీజన్ తర్వాత టెస్ట్ క్రికెట్‌కు భారత బ్యాటర్లు ఎలా అలవాటు పడతారన్న ప్రశ్నకు వారు తమ బ్యాట్లతోనే సమాధానమిచ్చారు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (24) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా, తర్వాత వచ్చిన బ్యాటర్లు ఆఫ్ఘన్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు.

రెండో వికెట్‌కు క్రీజులో నిలిచిన కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ ఆఫ్ఘన్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ఈ క్రమంలో సుదర్శన్ 81 పరుగుల వద్ద ఔటవగా, వీరిద్దరి మధ్య రెండో వికెట్‌కు 139 పరుగుల కీలక భాగస్వామ్యం నమోదైంది. ఆ తర్వాత కెప్టెన్ గిల్‌తో జతకట్టిన రాహుల్, తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకుంటూ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం సాధించిన మరుసటి బంతికే 100 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రాహుల్ పెవిలియన్ చేరాడు.

అనంతరం క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ రిషభ్ పంత్‌తో కలిసి కెప్టెన్ గిల్ ఇన్నింగ్స్ కొనసాగించాడు. పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడగా, గిల్ ఎంతో బాధ్యతాయుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంటూ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరూ అజేయంగా నాలుగో వికెట్‌కు 121 పరుగులు జోడించి

తొలి రోజు ఆటను ముగించారు. గిల్ (103 బ్యాటింగ్), పంత్ (50 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లు రోజంతా తీవ్రంగా శ్రమించారు. ముఖ్యంగా పేసర్లు తొలి రెండు సెషన్లలో భారత బ్యాటర్లను కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేసినా, చివరి సెషన్‌లో పూర్తిగా తేలిపోయారు. సలీం సఫీ రెండు వికెట్లు తీయగా, జియావుర్ రహ్మాన్ షరీఫీకి ఒక వికెట్ దక్కింది. రెండో రోజు ఉదయం బౌలర్లు తాజాగా ఉన్నప్పుడు పరిస్థితులు అనుకూలించవచ్చనే ఆశతో వారు రెండో కొత్త బంతిని కూడా తీసుకోలేదు. మొత్తంగా తొలి రోజు ఆట పూర్తిగా టీమిండియాకే సొంతమైంది.

## కెప్టెన్‌గా తొలగింపు.. సూర్యకుమార్ ఫస్ట్ రియాక్షన్ ఇదే..!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ తొలిసారి సోషల్ మీడియాలో స్పందించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో భారత క్రికెట్ జట్టు ఫొటోను షేర్ చేశారు. “ఎంతో ప్రతిభావంతులైన ఈ ఆటగాళ్ల బృందానికి నా శుభాకాంక్షలు. రాబోయే సవాళ్లలో ఈ జట్టు విజయం సాధించాలని కోరుకుంటున్నాను” అని సూర్యకుమార్ రాసుకొచ్చాడు. కెప్టెన్సీ పోయినప్పటికీ జట్టుకు మద్దతుగా నిలిచిన అతడి క్రీడాస్ఫూర్తిని అభిమానులు మెచ్చుకుంటున్నారు.మరో పోస్ట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని సూర్యకుమార్ అభినందించాడు. టీమ్ఇండియాకు వైభవ్ ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తం చేశాడు. “నువ్వు ఈ అవకాశాన్ని కష్టపడి సంపాదించుకున్నావు. నీ క్రికెట్ ప్రయాణాన్ని చూడటానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను” అని పేర్కొన్నాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులు చేసిన 15 ఏళ్ల వైభవ్‌ను సూర్య మనస్ఫూర్తిగా అభినందించడం విశేషం.మార్చిలోనే సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత్ టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను గెలుచుకుంది. అయితే ఆ తర్వాత జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లలో అతడు ఫామ్ కోల్పోయాడు. ప్రపంచకప్‌లో కూడా కేవలం 242 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా సూర్యకుమార్‌ను పక్కనబెట్టి శ్రేయస్ అయ్యర్‌కు టీ20 కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించారు.



## రగులుతున్న కసిలో లెనిన్ లవ్.. దీంతో జోరు పెరిగేనా?




అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘లెనిన్’ నుంచి ‘సోల్ ఆఫ్ లెనిన్’ అనే కొత్త సాంగ్ విడుదలైంది. జూన్ 26న సినిమా రిలీజ్ కాబోతున్నా ఇప్పటివరకు పెద్దగా ప్రమోషన్ల హడావుడి లేకపోవడంతో ఈ పాటతోనైనా బజ్ క్రియేట్ అవుతుందా అని అక్కినేని ఫ్యాన్స్ చూస్తున్నారు. నార్మల్ గా సినిమా విడుదలకు నెల రోజుల ముందే ప్రమోషన్ల వేగం పెంచుతారు. కానీ ఈ మూవీ టీమ్ మాత్రం చాలా లేట్ గా తమ పబ్లిసిటీని ఈ పాటతో మొదలుపెట్టింది.

లేటెస్ట్ గా వచ్చిన ఈ సాంగ్ ఒక రొటీన్ లవ్ సాంగ్ లా కాకుండా, కథలోని ఇంటెన్సిటీని హైలెట్ చేస్తోంది. నిజమైన ప్రేమలో ఉండే పెయిన్, స్ట్రగుల్స్ ను విజువల్ గా బాగానే ప్రెజెంట్ చేశారు. అఖిల్ తో పాటు హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకునేలా ఉంది. రగులుతున్న కసిలో ఇద్దరి ప్రేమ ఏదో ఛాలెంజ్ ను ఫేస్ చేయనున్నట్లు తెలుస్తోంది. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్, వాగ్దేవి వాయిస్ ఈ ఎమోషనల్ మెలోడీకి బాగా సెట్ అయ్యాయి. కళ్యాణ్ చక్రవర్తి రాసిన లిరిక్స్ కూడా డెప్త్ తో ఉన్నాయి.కెరీర్ స్టార్ట్ చేసి పదేళ్లు కావస్తున్నా అఖిల్ కు ఇప్పటివరకు సరైన కమర్షియల్ బ్రేక్ రాలేదు. ఏజెంట్ డిజాస్టర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని చేస్తున్న సినిమా కావడంతో లెనిన్ పై అతని కెరీర్ డిపెండ్ అయి ఉంది. మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్టైనర్ ను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్టైన్మెంట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. నాగార్జున, నాగవంశీ లాంటి పెద్ద నిర్మాతలు వెనకుండటం ఈ ప్రాజెక్ట్ కు ఉన్న మెయిన్ అడ్వాంటేజ్.మొదట్లో ఈ సినిమాను మే 1న రిలీజ్ చేయాలనుకున్నా, రామ్ చరణ్ పెద్ది సినిమాతో పోటీ వద్దని జూన్ 26కు మార్చారు. అయితే షూటింగ్ ఇంకా కొద్దిగా పెండింగ్ లో ఉండటం వల్లే ప్రమోషన్స్ ఆలస్యమయ్యాయనే ఒక టాక్ కూడా ఉంది. ప్రమోషన్ల పరంగా ఇప్పటివరకు సైలెంట్ గా ఉన్న మేకర్స్, ఇకపై నాన్ స్టాప్ గా కంటెంట్ ను వదిలితేనే బాక్సాఫీస్ దగ్గర ఆశించిన ఓపెనింగ్స్ రాబట్టడం సాధ్యమవుతుంది.ఎందుకంటే మరికొన్ని పెద్ద సినిమాలు కూడా లైన్ లో ఉన్నాయి. ఈ కాంపిటీషన్ ను తట్టుకోవాలంటే కేవలం ఒక సాంగ్ తో సరిపెట్టకుండా టీజర్లు, ట్రైలర్లు, ప్రెస్ మీట్స్ తో జనాల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేయాలి. అఖిల్ మాస్ లుక్ తో పాటు ఈ ఎమోషనల్ కంటెంట్ ఆడియన్స్ కు ఎంతవరకు రీచ్ అవుతుందో చూడాలి. మరి ఈ కొత్త సాంగ్ ఇచ్చిన బూస్ట్ తో లెనిన్ టీమ్ ప్రమోషన్ల సౌండ్ ఎంతవరకు పెంచుతుందో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



**రష్మిక మందన్న అద్భుతమైన బ్లేజర్ మరియు బాడీసూట్ లుక్‌లో గ్లామ్ కోటియన్‌గా మారింది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com